RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 163 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం,డిసెంబర్,19,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 163 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday,December,19,2025 | PAGES : 8 RS : 4 /- |


## మహాత్ముడిని అవమానించారు

### రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రియాంక



న్యూఢిల్లీ,డిసెంబర్18:మహాత్మాగాంధీని అవమానించేందుకే కొత్తగా జి రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు.

'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీపథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లువలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగాఇబ్బంది పడే అవకాశం ఉంది. నరేగా పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై ప్రియాంక తీవ్ర విమర్శలు చేశారు.



## 'ఆపరేషన్ సిందూర్'

# మన సత్తా చాటింది

### వేగంగా, కచ్చితత్వంతో దాడులు చేయగలం

- ఉగ్రశిబిరాల ధ్వంసంలో వాయుసేన వేగం, కచ్చితత్వం అద్భుతమని ప్రశంస
- పాక్ దాడుల యత్నం వేళ ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్న రాజ్ నాథ్
- ఆధునిక యుద్ధాల్లో వైమానిక శక్తిదే నిర్ణయాత్మక పాత్ర అని స్పష్టీకరణ

ఢిల్లీ,: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో.. వేగంగా, అత్యంత ప్రభావవంతంగా స్వల్పకాలిక సైనిక చర్యలు చేపట్టగల సత్తాను భారత్ స్పష్టంగా నిరూపించుకుందని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. భారత వైమానిక దళం సాంకేతికంగా, కార్యాచరణ పరంగా అత్యంత పటిష్ఠమైన శక్తిగా అవతరించిందని ఆయన కొనియాడారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన ఎయిర్ ఫోర్స్ కమాండర్ల సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈఆపరేషన్‌సమయంలోఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడంలో వాయుసేనచూపిన ధైర్యం, వేగం, కచ్చితత్వాన్ని రాజ్ నాథ్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

## నదీ జలాలపై..

# బీఆర్ఎస్ ద్రోహం

### దమ్ముంటే కెసిఆర్ చర్చకు రావాలి: సిఎం రేవంత్



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** నదీజలాల విషయంలో ద్రోహం చేసిందెవరో మీడియా ముందకు వస్తే నిజాలు వెల్లడిస్తానని సిఎం రేవంత్ సవాల్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమం త్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ జలాల విషయంలో మా ట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజె క్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవడం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి.

కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో

# వీబీ జీ రామ్ జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



- లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
- వెల్‌లోకి దూసుకెళ్లి పప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు

న్యూఢిల్లీ, డిసెంబర్18 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లు కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్ర తిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరస నల మ ధ్య ఈ బిల్లును ఆమోదించా రు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసన లపై స్పందిం చిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుధీర్ఘంగా చర్చించారని చెప్పా రు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఎంజీనరేగాను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భం గా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహిం చగా.. బిల్లు కు ఆమోదం లభించింది. ఈ సమయ ంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. అంతకు ముందు బిల్లు తీరు పట్ల మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడే శారు.



## పది నెలల్లో 8 యుద్ధాలు

# ఆపాను


### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

- దేశాన్ని గందరగోళంగా మార్చి బైడెన్ తనకు అప్పగించారన్న ట్రంప్
- టారిఫ్‌ల వల్లే అమెరికా ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందని వ్యాఖ్య
- ట్రంప్ ఆర్థిక విధానాలకు 33 శాతమే ప్రజల ఆమోదం

వాషింగ్టన్: తాను అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఎనిమిది యుద్ధాలను ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. టారిఫ్‌ల (సుంకాలు) వల్లే ఇది సాధ్యమైందని, ఇంగ్లిష్‌లో తనకు అత్యంత ఇష్టమైన పదం కూడా అదేనని పునరుద్ఘాటించారు. తన ముందు అధ్యక్షుడిగా ఉన్న జో బైడెన్ దేశాన్ని గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టి తన చేతుల్లో పెట్టారని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన 79 ఏళ్ల ట్రంప్ తన ప్రభుత్వ 2026 ఎజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నేను అమెరికా బలాన్ని పునరుద్ధరించాను. పది నెలల్లో ఎనిమిది యుద్ధాలను పరిష్కరించాను.

# సుక్మా అడవుల్లో..ఎన్‌కౌంటర్

### - ముగ్గురు మావోయిస్టులు హతం - భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాల స్వాధీనం



రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో ఒక మహిళా మావోయిస్టు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్ డిసెంబర్ 18 గురువారం ఉదయం సుక్మా జిల్లా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోనగుడ-దులేడ్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది.డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), బస్తర్ ఫైటర్స్ దళాలు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టిన సమయంలో అటవీ ప్రాంతంలో దాక్కున్న మావోయిస్టులు భద్రతా బలగాలపై కాల్పులు ప్రారంభించారు. వెంటనే అప్రమత్తమైన బలగాలు ఎదురుకాల్పులకు దిగగా, కొంతసేపు తీవ్రంగా కాల్పులు కొనసాగాయి. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు అక్కడికక్కడే మ ృతి చెందారు.



## పరిషత్ ఎన్నికల్లో 42 శాతం

# రిజర్వేషన్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో పంచాయతీ ఎన్నికల పోరు ముగిసింది. మూడు విడతల్లో ఎన్నికల ప్రక్రియ జరిగింది. చివరి విడత పోలింగ్ బుధవారం పూర్తయింది. అయితే, పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మూడు విడతల్లోనూ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులుగా పోటీ చేసిన సర్పంచ్ లు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. అయితే, ఇదే ఊపులో జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలనుసైతం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. మండల పరిషత్ (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ (జడ్పీటీసీ) ఎన్నికలను వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వ భావిస్తుంది. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వానికి చెప్పిందని సమాచారం. దీంతో ఈ నెలాఖరులో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు.. తొలుత మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందట. అన్నీ అనుకూలిస్తే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కంటే ముందే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వంలోని..

# రేవంత్ రెడ్డికి దిమ్మ తిరిగే తీర్పు

### మాజీ మంత్రి హరీష్ రావు



**మెదక్,తెలంగాణ దిశ :** రేవంత్ రెడ్డికి పల్లె ప్రజలు దిమ్మ తిరిగే తీర్పు ఇచ్చారని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌ల సన్మానం మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరగగా మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్యఅతిథిగా హాజరై గెలిచిన సర్పంచ్‌లను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు పోటీగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం మామూలు విజ యంకాదన్నారు. ఎప్పుడైనా ఏ రాష్ట్రంలోనైనా రూలింగ్ పార్టీ సర్పంచ్ లు 80 నుంచి 90 శాతం గెలుస్తారని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉంటే బీఆర్ఎస్ పార్టీ 40 శాతం సర్పంచ్ లు గెలవడం గొప్ప విషయంగా చెప్పారు. అంటే ఇది దేనికి సంకేతం? ఒకవైపు రేవంత్ రెడ్డి కాలికి బలపం కట్టుకొని తిరిగి, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ జిల్లా జిల్లాలు తిరిగిండన్నారు. అయినా కూడా జనం బండకేసి కొట్టారన్నారు.సింబల్ లేని సర్పంచ్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి గూబ గుయ్యిమనిపిచ్చింద్రన్నారు. త్వరలో జరిగే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి మైండ్ బ్లాక్ అవుతుందని అన్నారు. బీఆర్ఎస్ సర్పంచ్ విజయం చూసి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టే ధైర్యం రేవంత్ రెడ్డి చేసే అవకాశం లేదన్నారు. 90శాతంగెలవాల్సిన అధి కార పార్టీ 50శాతం లోపే పరిమితమైందని, బీసీలకు 42 శాతం బీసీ రిజర్వేషన్ అనిమోసం చేసిందన్నారు. రైతుబంధు అనిమోసం. రైతులకు యూరియా ఇవ్వకుండా తిప్పలు.

# 16వ డివిజన్ కు కుషాయిగూడ పేరు రాకుండా

# చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు

## నిర్మాణాల దగ్గర వసూళ్ల రాణిగా అవతారం ఎత్తిన కార్పొరేటర్

### కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి







**కుషాయిగూడ, డిసెంబర్ 18, (తెలంగాణ దిశ) :** కుషాయిగూడ డివిజన్ ఏర్పాటు కాకుండా చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు, కుతంత్రాలు చేసిందని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆరోపించారు. 80 గజాల ఇల్లు కట్టుకున్నా లక్షల రూపాయలు దండు కోవడానికి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వసూళ్ల రాణి అవతారం ఎత్తిందని ఆరోపించారు. జిహెచ్ఎంసి 16వ డివిజన్ ను కుషాయిగూడ డివిజన్ గా ఏర్పాటు దాదాపు ఖరారైయిందన్న విషయం తెలిసి కుషాయిగూడ కాలనీల ప్రజలు గురువారం కుషాయిగూడ బస్టాండ్ ప్రాంగణంలో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన ప్రకటన వెలువడిన రోజు నుంచి కుషాయిగూడ కాలనీల కుటుంబాలు చేసిన ఆందోళనతో డివిజన్ ఏర్పాటు దాదాపు ఖరారైన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ లో దోచుకుంటున్నది చాలదన్నట్టుగా కుషాయిగూడ డివిజన్ ఏర్పాటు కాకుండా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు కుతంత్రాలు చేశారని ఆరోపించారు. 80 గజాల స్థలంలో ఇల్లు కట్టుకుంటున్న గుడిలో అర్చకత్వం నిర్వహించే పురోహితులను సైతం వదలకుండా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి లక్షల రూపాయలు కప్పం రూపంలో వసూలు చేశారన్నారు. లక్ష్మీనరసింహ కాలనీలో ఇల్లు కట్టుకుంటున్న పేద యాదవ కుటుంబం నుంచి కూడా దాదాపు రూ. 75 వేలు వసూలు చేశారన్నారు. వేలాది మంది పేద మధ్యతరగతి వ్యాపారాలు నిర్వహించుకునే కుటుంబాలకు అన్నం పెట్టి అక్కున చేర్చుకున్న కుషాయిగూడ ప్రాంతం చరిత్రను పదేళ్లుగా రాజకీయం చేస్తూ కార్పొరేటర్ శ్రీదేవి కోట్లాది రూపాయలు దోచుకు తిన్నారని ఆరోపించారు. ఇకనైనా కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుట్రలు, కుతంత్రాలు చేయడం మానేయకపోతే రేపటి నుంచి కుషాయిగూడ కాలనీలలో చాయిపే చర్చ కార్యక్రమంతో ముందుకు సాగుతూ ఆమె అవినీతి బండారాన్ని సాక్షాధారాలతో బయటపెడతామన్నారు. చర్లపల్లి కాలనీల సమాఖ్య (సిసిఎస్) అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి మాట్లాడుతూ కార్పొరేటర్ బొంతు శ్రీదేవిఒవైపు కుషాయిగూడ డివిజన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మరోవైపు జనాలను తప్పుదోవ పట్టించేలా కల్లబొల్లి మాటలతో దిగజారుడు ప్రకటనలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలను కోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, చల్లా ప్రభాకర్, తాళ్ల ఆనంద్ గౌడ్, వెంకటేశ్వర్లు, పంజాల శ్రీనివాస్ గౌడ్ పాండాల శివకుమార్ గౌడ్, చల్లా వెంకటేష్, పిట్టల రాజు, జనార్దన్,మణి కిరణ్, కుషాయిగూడ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నాగార్జున నగర్ అధ్యక్షులు యావపురం రవి, సారా అనిల్ ముదిరాజ్, వైష?వి ఎన్ క్లేవ్ అధ్యక్షులు గంప కృష?, సాయినగర్ అధ్యక్షులు సారా వినోద్ ముదిరాజ్, వాసుదేవ్, ఎస్ఏ. రహీం, సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.




# డివిజన్ల పునర్విభజన అంశంతో నగరంలో వేడెక్కుతున్న రాజకీయం

## ఫిబ్రవరిలో జిహెచ్ఎంసి ఎన్నికలు..!



నగరంలో రాజకీయం వేడెక్కుతుంది. ఇందుకు జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన అంశం వేదికవుతుంది. ప్రభుత్వం నిర?యాలు సైతం త్వరలోనే జిహెచ్ఎంసి ఎన్నికలు జరుగుతాయని సంకేతాలు ఇస్తున్నాయి. సర్పంచ్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్ పీటీసీ ఎన్నికలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణకు పూనుకుంది. సర్పంచ్ ఎన్నికలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉండడంతో సమరోత్సహంతో అడుగులు ముందుకేస్తుంది. ఇందులో భాగంగా ఎంపీటీసీ, జెడ్ పిటిసి ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తుంది. ఈ ఎన్నికల అనంతరం ఫిబ్రవరి చివరి వారంలో జిహెచ్ఎంసి ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.
దీంతో జిహెచ్ఎంసి పరిధిలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా ఊపందుకుంది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ నగరం పై పట్టు సాధించేందుకు సిద్ధమవుతున్నాయి. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న మునిసిపాలిటీలను జిహెచ్ఎంసి లో విలీనం చేసి 150 డివిజన్లను 300 డివిజన్లకు విస్తరించిన నేపథ్యంలో పునర్విభజన అంశం రాజకీయాలకు వేదికయింది. వారం క్రితం ప్రశాంతంగా ఉన్న నగరం డివిజన్ల పునర్విభజన అంశం తన మీద రావడంతో ఒక్కసారిగా పావులు కదపడం ప్రారంభించాయి. మార్చి నెలలో విద్యార్థుల పరీక్షలను ద ృష్టిలో ఉంచుకొని ఫిబ్రవరి లోపు జిహెచ్ఎంసి ఎన్నికలను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇలా కుదరనీ పక్షంలో పరీక్ష అనంతరం ఏప్రిల్ లో కచ్చితంగా ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి పార్టీలు శ్రేణులను సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశాయి. దీంతో స్థానికంగా ఆయా రాజకీయ పార్టీల నుంచి టికెట్లు ఆశిస్తున్న నేతలు ఒక్కసారిగా రాజకీయ కార్యకలాపాలను ఉద ృతం చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ గత రెండు సంవత్సరాలుగా చేపడుతున్న అభివ ృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ సర్పంచ్ ఎన్నికలలో అక్రమాలు, జిహెచ్ఎంసి డివిజన్ల పునర్విభజన లోపాలు, ప్రభుత్వ అవినీతి అక్రమాలను ప్రధానంగా ఎత్తి చూపిస్తుంది. బిజెపి నేతల సైతం తమదైన శైలిలో ఆందోళన కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్నారు. అన్ని సక్రమంగా కుదిరితే ఫిబ్రవరి లేదా ఏప్రిల్ నెలలో జిహెచ్ఎంసి ఎన్నికలు జరగవచ్చునని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**- మెరుగు చంద్రమోహన్ - ఎడిటర్, తెలంగాణ దిశ**

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

### టీడబ్ల్యూజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య

### భద్రాద్రి జిల్లాలో మహాసభ సన్నాహక సమావేశం - మహాసభ నిర్వహణ కమిటీ ఏర్పాటు




భద్రాచలం, డిసెంబర్ 18, (తెలంగాణ దిశ) :
జర్నలిస్టుల కనీస సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య విమర్శించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా ఇంతవరకు జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేకపోయిందని అన్నారు. గురువారం భద్రాచలంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా త ృతీయ మహాసభల నిర్వహణకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. భద్రాచలంలోని హరిత హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో మామిడి సోమయ్య పాల్గొని, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘ కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టీడబ్ల్యూజేఎఫ్ సంఘం బలోపేతానికి సంఘం బాధ్యులు కృషి చేసి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. భద్రాద్రి-కొత్త గూడెం జిల్లాలో సంఘం బలంగా ఉందని, త్వరలో జిల్లా మహాసభలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం భద్రాచలంలోని టీఎన్‌జీఓ కార్యాలయంలో జిల్లా మహాసభ నిర్వహణ ఏర్పాట్లపై మరోసారి సమావేశమై చర్చించారు. జిల్లా మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజెఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు చిర్రా శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కో- కన్వీనర్లు వల్లాల జగన్, కుడితాడు బాబురావు, కర్ర అనిల్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ అధ్యక్షుడు సూరిబాబు, మాజీ కార్యదర్శి గుండబోయిన వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.


#### జిల్లా మహాసభ నిర్వహణ కమిటీ ఏర్పాటు

ఈ సందర్భంగా భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా త ృతీయ మహాసభ నిర్వహణ కమిటీ ఏర్పడింది. కన్వీనర్‌గా కర్ర అనిల్ రెడ్డి, కో-కన్వీనర్లుగా సూరిబాబు, గుండబోయిన వెంకటేశ్వర్లు, డి. రవికుమార్, ఎస్. సంపత్, వెలమ రాజేందర్, సైదయ్య లను నియమించారు.





జిల్లాలో జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడం, సమస్యల పరిష్కారానికి సంఘాన్ని మరింత బలంగా నిలబెట్టడం లక్ష్యంగా ఈ మహాసభ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహాసభలను త్వరలో నిర్వహించాలని నిర్ణయిస్తూ, అందుకు సంబంధించిన ఈ మహాసభ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు.

# బంగారం నిల్వల్లో భారత్ 8వ స్థానం



ముంబై : ప్రంచవ్యాప్తంగా బంగారం రేట్లు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఎవరూ ఊహించని విధంగా ఆకాన్నంటుతున్నా యి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో గోల్డ్ రేటుకు బ్రేకులు పడటం లేదు. దాదాపు తులం బంగారం లక్షన్నరకు చేరుకోగా.. రానున్న కొద్ది నెలల్లో రూ.2 లక్షలకు కూడా ఎగబాకే అవకాశముందని బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల వల్ల గోల్డ్‌పై పెట్టుబడి పెట్టేందుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గోల్డ్ రేట్ భారీగా పెరగడానికి ఇదొక కారణంగా తెలుస్తోంది. అన్ని దేశాలు కూడా ద్రవ్యోల్బణం, కరెన్సీని రక్షించుకోవడానికి తమ వద్ద గోల్డ్ నిల్వలను పెంచుకుంటున్నాయి. ప్రపంచ గోల్డ్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదిక దీనిక బలం చేకూర్చుతోంది. ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ నిల్వల్లో అమెరికా తొలి స్థానంలో ఉంది. 2000వ సంవత్సరం నుంచి ఆ దేశంలో గోల్డ్ నిల్వలు స్థిరంగా ఉన్నాయి. ప్రస్తుతం సగటును 8,134 టన్నులు ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.ఇక గోల్డ్ నిల్వల్లో జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా తర్వాత జర్మనీ దగ్గర ఎక్కువ బంగారు నిల్వలు ఉన్నాయి. దాదాపు ఆ దేశం దగ్గర 3,350.25 టన్నులనిల్వలు ఉన్నాయి.
గత త్రైమాసి కం కంటే ఈ సారి నిల్వలు కొంచెం తగ్గాయి. ఇక ఇటలీ దగ్గర కొన్ని దశాబ్దాలుగా నిల్వలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 2,451.84టన్నులుగా ఉంది. 2000, 2003, 2025 నుంచి ఇదే సంఖ్య నమోదవుతూ వస్తోంది.ఇక తర్వాతి స్థానంలో ఫ్రాన్స్ ఉంది. ఫ్రాన్స్ దగ్గర ప్రస్తుతం 2,437 టన్నుల నిల్వఉంది. ఇక రష్యా దగ్గర (2,329.63 టన్నులు), చైనాదగ్గర (2,279.6 టన్నులు), స్విట్జర్లాండ్ దగ్గర(1,040 టన్నులు) నిల్వల ఉన్నాయి.ఇక ఇండియా దగ్గర ప్రస్తుతం 800 టన్నుల గోల్డ్ నిల్వ ఉంది. గత త్రైమాసికం కంటే నిల్వలు కాసత్ పెరిగాయి. 2000-2025 వరకు నిల్వలు సగటున 531 టన్నులుగా ఉన్నాయి. 2001లో అత్యల్ప స్థాయిలో నమోదైంది.

# కూటమి చేతికి మండలి!



**విజయవాడ,తెలంగాణ దిశ:** వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. వారి రాజీనామాలు విషయంలో కోర్టు నాలుగు వారాల పాటు గడువు విధించింది. జయ మంగళం వెంకట్రమణ కోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు తీర్పు వచ్చింది. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం శాసనమండలి చైర్మన్ పై ఏర్పడింది. గత ఏడాది కాలంగా ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం నలుగుతూనే ఉంది. వైసీపీ రాజకీయ అవసరాల కోసం శాసనమండలి అవసరం. చైర్మన్ మోసేన్ రాజు ఆ పార్టీకి చెందిన నేత కావడంతో హై కమాండ్ నుంచి ఇంతవరకు ఎమ్మెల్సీల రాజీనామా పై ఆదేశాలు రాలేదు. దీంతో చైర్మన్ సైతం ఆ రాజీనామాలను ఆమోదించలేదు. అయితే ఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. ఇప్పుడు అదే శాసనమండలి ఆయనకు అక్కరకు వస్తోంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కర్రీ పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయ మంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జాకీయా ఖానం తదితర ఎమ్మెల్సీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు.

# సంపాదకీయం

## రసవత్తరంగా కన్నడ రాజకీయాలు!

కర్ణాటక రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మొన్నటిదా కా అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని అటు సీఎం సిద్ధరామ య్య.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గంభీరంగా పేర్కొన్నప్పటికీ లోలోపల మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. హైకమాండ్ మాటకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్న డీకే శివ కుమార్ తాజాగా తన 'ఎక్స్' ఖాతాలో 'ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడ మే ప్రపంచంలో పెద్ద శక్తి' అని ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా సిద్ధరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారుఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది. 2023లో కర్ణాటకకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీకి మించి 23 సీట్లు అధికంగా సాధించి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి సిద్ధరామయ్యతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడైన డీకే శివకుమార్ శక్తికి మించి పనిచేశారు. దీంతో ఐదేళ్ల పాలనలో రెండున్నరేళ్లు పూర్తి కాగానే అధికార మార్పిడి జరగాలని ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు సిద్ధరామయ్య ఈ ఏడాది నవంబర్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆ తర్వాత సీఎం పగ్గాలను డీకేకు అప్పగించాలికానీ సిద్ధరామయ్య పార్టీ కేంద్ర నాయకత్వంతో భేటీ అయ్యి ఐదేళ్లు తానే సీఎంగా ఉండేలా అనుమతులు తెచ్చుకోవడంలో తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇదే సమయంలో డిప్యూ టీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ కూడా సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్ధంగా లేరనిపించింది. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో డీకే పాత్ర మరువలేనిది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అన్ని వర్గాలను కలుపుకుని పోయి సమన్వయంతో వ్యవహరించి పార్టీని విజయపథంలో నడిపించారు. అయితే అపార పరిపాలన అనుభవం కలిగిన సిద్ధరామయ్యకే సీఎం పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం మొగ్గుచూపింది. హైకమాండ్ ఆదేశాలను తాను శిరసావహిస్తానని డీకే చెప్పడంతో సమస్య చల్లబడినట్లుగా అనిపించింది. ఈ నవంబర్ 20తో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి కావడంతో అధికార మార్పిడి అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. శివకుమార్‌ను పొలిటికల్ మాస్టర్ మైండ్‌గా అభివర్ణించినప్పటికీ.. పాలన విషయంలో సిద్ధరామయ్య ఒక మెట్టు ముందు ఉంటారు. జనతాదళ్ నుంచి బహిష్కరణకు గురై 2006లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సిద్ధరామయ్య పార్టీలో అగ్రస్థానానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య , డీకే శివకుమార్ మధ్య పోరు కొనసాగుతుండగా ఉప ముఖ్యమంత్రికి పదోన్నతి కల్పించాలని కోరేందుకు ఆయన మద్దతుదారులు ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కాగా పార్టీ అధిష్టానం నిర్ణయిస్తే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య సోమవారం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన కొందరు ఎమ్మెల్యేలకు అదనంగా డీకే శిబిరానికి చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ చేరుకోగా మరికొందరు కూడా హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని తనతోపాటు డిప్యూటీ సీఎం కూడా అంగీకరించక తప్పదని సిద్ధరామయ్య విలేకరులకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం.నవంబర్ 20వ తేదీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. మరోవైపు తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానంటూ మాజీ కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వర ప్రకటించడం కలకలం రేపుతోంది.ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాటలు తనకు వేద వాక్యం లాంటివని శివకుమార్ సోమవారం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని, అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరులు ప్రశ్నించినపుడు తాను కూడా ముఖ్యమంత్రి ప్రకటనతో ఏకీభవిస్తున్నానని డీకే చెప్పారు. 2013లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంతో పాటు సీఎంగా ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని సమర్ధంగా నడిపించారు. ఇటు సిద్ధూ.. అటు డీకేల్లో ఉన్న ప్రత్యేక లక్షణాలే ఇవాళ హైకమాండ్‌కు సీఎం మార్పు తలనొప్పిగా మారిపోయింది. 2006లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.పాలనా ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్లు పూర్తయిన తర్వాత జేడీఎస్ అధినేత కుమారస్వామి అయిష్టంగానే సీఎం పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు బీఎస్ యడ్యూరప్పకు అప్పగించారు. ప్రస్తుతానికి సీఎం సిద్ధరామయ్య పదవికి ఎలాంటి ముప్పు లేదని తెలుస్తోంది. కర్ణాటక రాష్టంలో ఓబీసీలదే రాజ్యమని కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలుసని నివేదికలు చెబుతున్నాయి ఆయనకు అహింద వర్గంతో పాటు పార్టీలోని 100 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కాంగ్రెస్ పార్టీకి సభలో మొత్తం 137 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య అంగీకారం లేకుండా ముఖ్యమంత్రిని మార్చడం అనేది చాలా కష్టం.కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల సమాఖ్య కాంగ్రెస్‌ను హెచ్చరించింది. రాష్ట్ర యూనిట్‌లో అంతర్గత కలహాల నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించడానికి ఏ ప్రయత్నం చేసినా అది పార్టీపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. మరోవైపు కర్ణాటక రాష్ట్ర వొక్కలిగ సంఘం కూడా ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటు న్న ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు అన్యాయం జరిగితే.. వారు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించింది. ముఖ్యమం త్రిని మార్చాలని సిద్ధరామయ్య వర్గంపై ఒత్తిడి తెస్తే వారు అధిష్ఠా నానికి పేర్ల జాబితాను సమర్పిస్తారని గత కొద్ది రోజులుగా మీడియా నివేదికలలో వెల్లడైంది. ఇందులో ఓ ప్రత్యామ్నాయంగా హోంమంత్రి జి.పరమేశ్వర్ పేరు ఉ ండవచ్చు. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. సిద్ధరామయ్య వర్గం ఏ పరిస్థితులలోనూ డీకే శివకుమా ర్‌ను తమ బాస్‌గా అంగీకరించడానికి సిద్ధంగా లేదు.అయితే కొన్ని రోజులకే జేడీఎస్ పార్టీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు రావడంతో ప్రభుత్వం కుప్పకూలింది.

# ముగిసిన పంచాయతీ పర్వం...

దాదాపు రెండు వారాలుగా తెలంగాణ రాష్ట్రంలోని పల్లెల్లో జరిగిన పంచాయతీ పర్వం ముగిసింది. ఈ రెండు వారాలు పల్లెల్లో పండగ కళ కనిపించింది. ఒకవైపు పలకరింపులు. మరొకవైపు విందుల సందడి అది చూసి తీరవలసిందే. పేరుకు పార్టీ రహిత ఎన్నికలైనప్పటికీ అభ్యర్థులకు ఏదో ఒక పార్టీ మద్దతు ఉండటం వాస్తవం. అధికార కాంగ్రెస్ తో పాటు రాష్ట్రంలో రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు ఇచ్చాయి. అయితే 2014లో రాష్ట్రంలో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ 2023 అసెంబ్లీ ఎన్నికలలో సాధించిన గెలుపు తరువాత 2024 లోకసభ ఎన్నికలలో తమ విజయ పరంపరను కొనసాగించి గ్రామ పంచాయతీలో మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ గెలిచింది. అదే సమయంలో లోక సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవని బిఆర్ఎస్ పార్టీ బాగా నిలదొక్కుకుని 3600కు పైగా గ్రామ సర్పంచ్ పదవులను కైవసం చేసుకోగలిగింది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కూడా దాదాపు 700 గ్రామ పంచాయతీలపై పట్టు సాధించింది. తమకు 70 శాతం సర్పంచ్ పదవులు దక్కాయని కాంగ్రెస్ చెపుతుండగా వారి వాదనను త్రోసిపుచ్చిన బిఆర్ఎస్ రెండు పార్టీల మధ్య తేడా స్వల్పమేనని ప్రకటించింది. ఏకగ్రీవాలలో 90 శాతం సర్పంచ్ స్థానాలు తమకు దక్కాయని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంత హడావిడిగా ఈ ఎన్నికలు జరపడానికి కారణం మురిగిపోవడానికి సిద్ధంగా ఉన్న కేంద్ర నిధులు.

ఈ నెల 20వ తేదీ లోపల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగి సర్పంచ్ లు పగ్గాలు చేపట్టక పోతే రూ. 3000 కోట్ల కేంద్ర నిధులు మురిగిపోయే అవకాశం ఉంది. అయితే 20వ తేదీ అమావాస్య ఉ న్నందువల్ల ప్రమాణ స్వీకారాలు చేయలేమని విజేతల నుంచి వచ్చిన అభ్యర్ధనల మేరకు ఆ తేదీని 22వ తేదీ సోమవారానికి మార్చారు. ఇప్పుడు పదవిని చేపట్టే సర్పంచులు అయిదేళ్ల పాటు అధికారంలో ఉ ంటారు. వీరు పదవిలో ఉన్నప్పుడే తదుపరి అసెంబ్లీ, లోకసభ ఎన్ని కలు జరుగుతాయి. ఈ మధ్యలో ఎంపీటీసీ, జడ్ పీటీసీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలతో పాటు 300 డివిజన్ల స్థాయికి పెరిగిన మహా హైదరాబాద్ నగర పాలక సంస్థ ఎన్నికలు కూడా జరుగనున్నాయి. గ్రామాల సత్వర అభివృద్ధికి , సంక్షేమ పథకాల ఫలితాల ఫలితాలు గ్రామీణుల ముంగిట్లోకి చేరేందుకు తాము బలపర చిన అభ్యర్థులను ఎన్నుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులం దరూ ఓటర్లను కోరారు.

'సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి' అనే కాంగ్రెస్ సందేశం ప్రజలకు చేరి పార్టీకి అనుకూల ఫలితాలు వచ్చాయని మహేష్ కుమార్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

మరోవైపు కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటు పడటం వల్లే పల్లె ప్రజలు ఓటుతో చెప్పిన సమాధానం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు వంటిదని బిఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగిన ప్రతిసారి అందరికీ గుర్తుకువచ్చేది మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య చేసిన వ్యాఖ్యలే. పంచాయతీ సమితి ఎన్నికలు జరిగితే ఫలితాలు వెలువడిన వెంటనే ఆయన"గెలిసినోళ్లందరూ మా వాళ్లే" అని ప్రకటించారు. అప్పటికి ఇంకా తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించలేదు. మిగతా పార్టీల ఉనికి అంతంత మాత్రమే. ఇప్పుడు పరిస్థితి వేరు. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ఏక పక్షంగా గెలుపును సాధిస్తూ ఉంటుంది. అన్ని రాష్ట్రాలలో కూడా ఫలితాల తీరు ఇదే విధంగా ఉంటుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రధాన ప్రతిపక్షంబిఆర్ఎస్‌పార్టీకి మధ్య తేడా ఎక్కువగా లేకపోవడం, బిజెపి పరపతి క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాగ్రత్తగా ఉండాలని పంచాయతీల ఫలితాలు సూచిస్తున్నాయి.

– ఆర్డీఆర్, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్.

# రాజకీయ పార్టీల నిబద్ధతకు పరీక్ష..!

రాజకీయాల్లో సంకల్ప బలం ముఖ్యం. తమతో పాటు బడుగుబల హీన వర్గాలను ముందుకు తీసుకుని వెళ్దామన్న ప్రయత్నం చేయాలి. ఎంతసేపు వారే పల్లకి మోయాలన్న ఫ్యూడల్ భావాలను వీడాలి. పల్లకి ఎక్కే అవకాశం వారికి కూడా కల్పించాలి. వారినీ సానబెట్టి రాటదేలేలా చేయాలి. స్థానిక ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్ల అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఇదే అదనుగా కాంగ్రెసేతర పార్టీలు కాంగ్రెస్‌ను తిట్టిపోస్తూ రాజకీయంగా లబ్దిపొందాలని చూస్తున్నాయి. నిజానికి రాజకీయంగా లబ్ది పొందాలంటే ఆయా వర్గాల్లో పట్టును సాధించాలి. అందుకు పార్టీ పరంగా ఆయా వర్గాలను ముందుకు తీసుకుని వెళ్లాలి. హైకోర్టు తీర్పు తరవాత గత్యంతరం లేని పరిస్థితు ల్లో ప్రభుత్వం పాతపద్దతిలోనే స్థానిక ఎన్నికలకు సిద్ధం అయ్యింది. ఇది ఆహ్వానించదగ్గ విషయం. రిజర్వేషన్లు ఉంటేనే బిసిలను, ఎస్సీ,ఎస్టీలను ఆదరించడం కాదు... లేకున్నా వారికి రాజకీయంగా ప్రవేశం కల్పించాలి. ఇప్పుడు రాజకీ య పార్టీలు అదేపనిగా పాత వ్యవహారాలను తవ్వుతూ పోకుండా తమ పార్టీ పరంగా బిసిలు, ఎస్సీలు, ఎస్టీలను రాజకీయింగా పైకి తీసుకుని వచ్చే ప్రయత్నాలు చేయాలి. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టగానే ఎందరో ఎస్సీలు, ఎస్టీలు, బిసిలకు టిక్కెట్లు ఇచ్చి రాజకీయ ంగా వారికి అండగా నిలిచారు. అనామకులు ఎందరో రాజకీయంగా తెరపైకి చ్చారు. గుంటూరులో కాంగ్రెస్ దిగ్గజం ఆచార్య ఎన్‌జి రంగా లాంటి వారు అనామకుడి చేతిలో ఓటమి చెందారు. అలా ఆనాడు ఎన్టీఆర్ సృష్టించిన ప్రభంజనంలో మహామహులు ఓటమి చెందారు. కొత్త తరం రాజకీయాల్లోకి వచ్చింది. అలా రాజకీయాల్లోకి వచ్చి నిలదొక్కుకున్న వారు నిలదొక్కుకున్నారు. ఆ తరవాత అదే ఒరవడి సాగింది. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బడుగు, బలహీనవర్గాల రాజకీయ ప్రవేశాలకు నాంది పలికింది. కుల ప్రాతిపదికను మొదటి కమిషన్ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తే, కులాన్ని ఒక సూచికగా తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం మండల్ కమిషన్ తీర్పులో స్పష్టం చేసింది. 1992లో ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదని ఇచ్చిన తీర్పు ఫలితంగా తమిళనాడు సహా ఎన్నో రాష్ట్రాల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. చివరికి ఇందిరా సహాని కేసు కూడా పరీక్ష ఎదుర్కొనక తప్పలేదు. తమిళనాడు 69శాతం రిజర్వేషన్లు కల్పించినప్పటికీ సుప్రీంకోర్టు విధించిన పరిధి వల్ల సందిగ్ధత ఏర్పడింది. దీంతో అసెంబ్లీలో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి, 69శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేట్టు, సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిధి నుండి రక్షణ పొందడానికి రాజ్యాంగం 9వ షెడ్యూల్లో చేర్చేట్టుగా అప్పటి ముఖ్యమంత్రి జయలలిత పావులు కదిపారు. అయితే ఇదంతా అసెంబ్లీ, పార్లమెంట్ వ్యవహారాల్లో పోరాడాల్సిన అంశం. అప్పటి వరకు ఈ వర్గాలను దూరం చేసుకోవడం తగదు. నిజానికి ఈ వర్గాలను దగ్గరకు చేసుకునేందుకు ఇదో మహత్తర అవకాశంగా రాజకీయ పార్టీలు భావించాలి. సర్పంచ్ పదవి అన్నది ఎవరైనా రాజకీయంగా ఎదగడానికి పరమపద సోపానం లాంటిది. యువతను రాజకీయాల్లో ఆహ్వానిం చేందుకు, గ్రామాలను అభివృద్దిలో నిలిపేం దుకు ఇదో మంచి అవకాశం. అధికార కాంగ్రెస్ సహా అన్నిపార్టీలు సర్పంచ్ ఎన్నికల్లో వివిధ కులవర్గాలకు చెందిన సమ ర్థులైన యువతను నిలపాలి. చదువున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. నిజాయితీ రాజకీయాలను ప్రోత్సహించాలి. అందుకు రిజర్వేషన్లు లేనిచోట్ల ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాలను నిలబెట్టాలి. వారంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశం వస్తుంది.దీంతో రాజకీయాల్లో కొత్తనీరు రావడానికి ప్రాతిపదిక వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించక తప్పడం లేదు. మరొకవైపు శాసనసభలో చేసిన తీర్మానాలకు కట్టుబడి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు రక్షణ కల్పించేలా 9వ షెడ్యూల్‌ను ఆశ్రయించాలనే ఉద్యమం కొనసాగుతోంది. ఈ విషయంలో ప్రచారం వేగంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా చేరింది.

గ్రామాల్లో కూడా ఇప్పుడిప్పుడే యువత రాజకీయాల వైపు మొ గ్గుచూపుతోంది. ఎంతకాలం వృద్ధ జంబుకాలే పార్టీల్లో వేలాడకుండా కొత్తతరాన్ని ఆహ్వానించాలి. సమాజంలో అట్టడుగుస్థాయి వర్గాలను వెతికి పట్టుకుని, వారిని రాజకీయాల్లో ముందుకు తీసుకుని రావాలి. ఎంతకాలం వారిని కేవలం కార్యకర్తలుగానే ఉపయోగించకునే దౌర్భాగ్యం నుంచి బయటపడి నవతరం నాయకత్వం అవతరించే దిశగా నేడు పార్టీలు అడుగులు వేయాలి. పార్టీపరంగా వారికి అండదండలు కల్పించాలి.

సవాళ్లను ఎదుర్కోవడానికి నిరంతర అవగాహన కల్పించాలి. వారిని రాజకీయాల్లో రాటుదేలేలా చేయాలి. విద్యార్థి ఉద్యమాలతో రాటుదేలిన వారిని ముందుకు దింపాలి. ఇందుకు పార్టీపరంగా సమైక్య పోరాటం అనివార్యంగా గుర్తించాలి. తెలంగాణ శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మాణాలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు 42శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలిపాయి. అదే స్ఫూర్తితో బీసీ సభ్యులను ఇప్పుడు గెలిపించుకోవాలి. పంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికకు పార్టీ గుర్తు ఉండదన్న నెపంతో వీరిని పక్కన పెట్టాలని చూస్తే అసెంబ్లీ తీర్మానాలకు విలువ ఉండదు. అందువల్ల అన్ని పార్టీలు ఈ విషయంలో తీవ్రంగా ఆలోచన చేసి, రిజర్వేషన్లు లేనిచోట్ల వివిధ వర్గాల అభ్యర్థులను నిలబెట్టి ముందుకు నడిపించాలి. రాజకీయాలలో ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా మనకు సమానత్వం ఉంది.కానీ సామాజిక, ఆర్థిక జీవితంలోమనకు అసమానతలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా రాజకీయాల్లో పదవుల పందేరంలో ఇప్పటికీ అంగ్రవర్గాలదే పైచేయిగా ఉంటోంది. మనం ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తొలగించాలి. లేకుంటే అసమానత లు ఎదుర్కొం టున్న వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంటే, అజమాయి షీ చెలాయి స్తున్న వారు అడుసులో కూరుకు పోతారు. ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని బలోపేతం చేయాలంటే అసమాన తలు అన్నవి తొలగించుకుంటూ పోవాలి. అందుకు రిజర్వేషన్లే ప్రాతిపదిక కానవసరం లేదు. రాజకీయ సంకల్పం ఉంటే ఇది సాధ్యం అవుతుంది.ఉన్నత వర్గాల వారికి చట్టసభల్లో స్థానాలు తగ్గించి, బీసీ వర్గాలకు స్థానాలు పెంచడం వల్ల సామాజిక సామరస్యత వస్తుంది. ఇప్పుడు రిజర్వేషన్ల కోసం కొట్లాడుతున్న బీసీ నాయకులను ఎన్నికలలో గెలిపించిన చరిత్రను లిఖించినవారు అవుతారు.

# పాత్రోచితంగా.. జనరంజకంగా!



'నటన అంటే హృదయాన్ని అవయవాలతో ప్రదర్శించటం' అన్నారు ఒకానొక సందర్భంలో (17-1-1964) బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి నటనకు మంత్రముగ్ధుడైన నాటకరంగ ప్రముఖుడొకరు. ఒక పాత్రా, నటుడూ పోటీపడటం అనేది ఒక రంగస్థలం మీదనే మనం చూడగలం. ఆయా పాత్ర పోషణలో నటుడు ఉత్కృష్టస్థాయిలో నటనను ప్రదర్శించి ప్రేక్షకుల్ని మైమరిపించటం మనం తరచూ చూస్తుంటాం. ఐతే ఒక పాత్రే, పాత్రధారిని ఆవహించి ప్రేక్షకుల ముందు సజీవంగా నిలబడటం అరుదైన సంఘటన. అవనిగడ్డలో నవంబర్ 19న ప్రదర్శించబడిన 'మహాపురుషుడు మండలి' నాటక ప్రదర్శన ఒక ప్రజానాయకుడి ఔన్నత్యాన్ని కళ్లకు కట్టించి ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. నిబద్ధత కలిగిన రాజకీయ నాయకుడిగా మండలి వెంకట కృష్ణారావు చేసిన ప్రజాసేవ ఈ కాలంలో నమ్మలేనంత నిజంగా దిగ్భ్రమ కలిగిస్తుంది.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని 16 ఏళ్ల వయసులోనే అందిపుచ్చుకుని అవనిగడ్డ లాంటి మారుమూల ప్రాంతంలో పాఠశాలపై మువ్వన్నెల పతాకాన్ని ఎగరవేసిన ధీశాలిగా మండలిని చూపిస్తూ నాటకం ప్రారంభమవుతుంది. డిజిటల్ సాంకేతిక సహకారంతో మండలి జీవితపు ఔన్నత్యాన్ని రంగస్థలం మీద, గాంధేయవాదిగా, నిరాడంబ రునిగా, సమాజ సేవాతత్పరునిగా, నిస్వార్థ ప్రజాసేవకునిగా, మానవతామూర్తిగా ప్రేక్షకుల మనస్సుల్లో ముద్రవేయగలిగింది నాటక ప్రదర్శన.గాంధీజీ తాత్వికతను ఒంటబట్టించుకొన్న మండలి 1952 నుంచి 1956 వరకు జిల్లా కాంగ్రెసు కార్యదర్శిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. ముప్ప య్యేళ్ళ పిన్న వయసుకే 1957లో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పార్టీ సంయుక్త కార్యదర్శిగా నియమించబడిన సందర్భంలో%ా% "నాకేదైనా పదవి వుంటే ఆ పదవిని ప్రజాసేవకు అంకితం చేస్తాను. ఏ పదవీ లేకపోతే నన్ను నేను ప్రజలకు అంకితం చేసుకుంటాను" అన్న డైలాగు ఆయన రాజకీయాదర్శానికి అద్దం పట్టింది.

ఏటిమొగ దగ్గరనుంచి హంసలదీవి వరకు కరకట్ట వేయించిన కారణంగా కొన్ని వేల ఎకరాలకు వరద ముప్పు తప్పటం, ఇరిగేషన్ స్కీంల వల్ల 15 వేల ఎకరాల భూమి సాగులోకి తెప్పించటం, దళిత బాలికలకు వసతి కల్పించటానికి భార్య ప్రభావతి తనకు పుట్టింటి వారిచ్చిన 40సెంట్ల భూమిని అప్పగించటం లాంటి ఎన్నో సేవా కార్యక్రమాల గురించి నాటకంలో ప్రస్తావించబడతాయి. 1972లో అవనిగడ్డ నుంచి శాసన సభకు ఎన్నికైన ఆయన ఏవిధంగా ప్రజాభిమానాన్ని చూరగొన్నారో వేదికపై చూపించారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా వున్న పి.వి. నరసింహారావు మంత్రిగా కోరిన శాఖను ఇవ్వటానికి సిద్ధపడినా, బడుగు, బలహీన వర్గాల సేవకు అవకాశముండే సాంఘిక సంక్షేమశాఖను ఎంపిక చేసుకోవటం మండలికి ప్రజాసేవపట్ల వున్న అంకితభావానికి అద్దం పడ్తుంది. పేదలకు వేలాది ఇళ్లు కట్టించటం కోసం ప్రణాళికలు వేయడం, విద్యార్థుల వసతి గృహాల నిర్వహణను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోనుంచి తప్పించి ప్రభుత్వ నిర్వహణలోకి తేవడం, వ్యవసాయ కూలీలకు ఇళ్ల పట్టాలివ్వడం, కులాంతర, వర్ణాంతర వివాహాలు ప్రోత్సహించడం లాంటి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. 'ప్రజలు నాయకుల పట్ల చూపే అభిమానం వల్ల వాళ్లకు లాభం జర గాలి, నష్టపోకూడదంటూ' ప్రజలు అభిమానంతో తెచ్చే పూలదండలు, బొకేలు, కానుకలను సున్నితంగా తిరస్కరించటం ఆయన నిరాడంబరత ను తార్కాణం. భూపరిమిత చట్టం ప్రకారం మిగులు భూముల్ని పేదలకు పంచటంకోసం ప్రభుత్వపరం చెయ్యమని భూస్వాముల్ని అభ్యర్థించటం తో, తాతలనాటి భూముల్ని వదులుకోబోమని సూటిపోటి మాటలతో ఆయన మనసును నొప్పించటంతో, తమకున్న ఏడెకరాల 15 సెంట్ల భూమిలో ఐదెకరాలు పేద ప్రజలకు పంచి ఇవ్వటం, అప్పటికి తనకున్న ఆస్తుల వివరాలు బహిరంగంగా ప్రకటించటం రంగస్థలంపై ఆదర్శవంత ంగా ప్రదర్శితమైంది. "తన దృష్టిలో పదవంటే బాధ్యత మాత్రమే తప్ప, అక్రమ సంపాదనకు, అవినీతికి దారిచూపే దోపిడీ వ్యవస్థకాదం టూ" నిజాయితీకి మారుపేరుగా నిలబడిన నాయకుడు మండలి.

1972 ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో శాసనసభకు ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో సమైక్యతా వాదానికి కట్టుబడిన మండలి నిరసనలు, అవమానాలు ఎదురైనా వేర్పాటువాదాన్ని సమర్థించలేదు. క్యాబినెట్ మంత్రిగా వుంటూ, ప్రజల బాధలు, ఇబ్బందులు తెలియాలంటే కారుల్లో కాదు తిరగాల్సిందంటూ బస్సుల్లో ప్రయాణించాడు. ప్రత్యేకాంధ్ర ఉద్యమం చల్లారక జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఏర్పడిన ప్రభుత్వంలో మండలి విద్యా సాంస్కృతిక శాఖామంత్రిగా నియమితులయ్యారు. ఆ సమయంలోనే తెలుగు అధికార భాషగా ప్రకటితమైంది. బాలోత్సవాలు, అఖిల భారత సాంస్కృతికోత్సవాలు నిర్వహించారు. 1975 ఉగాది పర్వదినాన హైదరాబాద్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు మండలి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టంగుటూరి సూర్యకుమారి శంకరంబాడి వారి 'మా తెలుగుతల్లి మల్లెపూదండ' గీతాన్ని ఆలపించారు. "నేను తెలుగువాణ్ణి అనుకొన్నప్పుడు నా ఒళ్లు పులకరిస్తుంది. ఆస్తి నష్టం, పదివేల మంది ప్రాణాలు కోల్పోవటంతో మండలి వారు పునరావాస పునర్నిర్మాణ కార్యక్రమాలకు నడుం బిగించి దేశ విదేశాల సహాయం కోసం అర్థించి ప్రభుత్వ పాలకుల్ని, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల్ని రప్పించటం, రాజీనామాకు సైతం సిద్ధపడి బాధితులకు అండగా నిలబడటం రంగస్థలంపై కమనీయంగా ప్రదర్శించారు.

# విజయ హైస్కూల్ లో షీ టీమ్ అవగాహన సదస్సు

## - సైబర్ నేరాలు, చైల్డ్ హరాస్మెంట్‌పై విద్యార్థులకు సూచనలు
## - డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా మెలగాలని పిలుపు





**కాప్రా, డిసెంబర్ 18, (తెలంగాణ దిశ):** కాప్రాలోని విజయ హైస్కూల్ లో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్, చైల్డ్ హరాస్మెంట్, డ్రగ్స్, రోడ్ సేఫ్టీ, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియాలో జరిగే మోసాలు, వాట్సప్ చాటింగ్ ద్వారా ఎదురయ్యే ప్రమాదాలు తదితర అంశాలపై షీటీమ్ అధికారులు విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. కుషాయిగూడ డివిజన్‌కు చెందిన షీటీమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ హబీబ్, ఇంచార్జ్ నళిని ఈ కార్యక్రమానికి హాజరై మొబైల్ వీడియో షో ద్వారా ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రాయోగిక ఉదాహరణలతో వివరించారు. ఆన్‌లైన్ భద్రత, స్వీయ అవగాహన, అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే ఎలా నివేదించాలో, రోజువారీ జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో సూచనలు చేశారు. డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా మెలగాలంటే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండటం అవసరమని తెలిపారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా సైబర్ నేరాలను ఎలా గుర్తించాలి, ఎలా నివారించాలనే అంశాలపై మార్గనిర్దేశం చేశారు. సురక్షితమైన సమాజ నిర్మాణానికి షీటీమ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ కుప్పునూరి రాజేష్ పేర్కొన్నారు. విద్యార్థులకు విలువైన అవగాహన అందించినందుకు షీటీమ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వీణ, ప్రిన్సిపల్ దేవినేని వెంగబాబు, ఉపాధ్యాయుల బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. సురక్షితమైన, సహాయక వాతావరణాన్ని పెంపొందించడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

# బాచుపల్లి ప్రభుత్వ స్థలం సర్వేనంబర్ 301 ను కాపాడాలి

## - హైడ్రాకు ఫిర్యాదు చేసిన మల్యాల రమణి






**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 18, (తెలంగాణ దిశ) :** బాచుపల్లి మండలంలోని గ్రామంలో సర్వేనెంబర్ 301 ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఉమెన్స్ నెట్ వర్క్ నేత మల్యాల రమణి గురువారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాచుపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 301 లో ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉండడంతోసమీప ఒక ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ స్థలాన్ని క్రమేపి కబ్జాలు పెడుతూ చట్టబద్ధత చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బాచుపల్లి రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే ఒక ఉద్యోగి ఈ ప్రభుత్వ స్థలంలో పాఠశాల వాహనాలు నిలపడానికి ప్రతి నెలా అద్దె వసూలు చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. హైడ్రాధికారులు తక్షణమే స్పందించి బాచుపల్లి సర్వే నెంబర్ 301 ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ఫెన్సింగ్ వేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆ ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఆమె కోరారు.

# క్షేమంగా వెళ్లిరండి..!

**ప్రయాణాలు.. కొందరికి ఉత్సాహాన్ని అందిస్తాయి. మరికొందరిని అనారోగ్యాల బారిన పడేస్తాయి. మరీ ముఖ్యంగా.. గర్భిణులను మరింత ఇబ్బంది పెడుతాయి. ఈ సమయంలో వాళ్లు అత్యంత జాగ్రత్తగా మెలగాలని గైనకాలజిస్టులు సూచిస్తున్నారు. ప్రయాణాలు సాఫీగా సాగాలంటే.. కింది జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.**



డాక్టర్ సలహా మేరకు: గర్భిణులు ప్రయాణాలు చేసేముందు గైనకాలజిస్టును కలవడం తప్పనిసరి. మొదటి, చివరి త్రైమాసికంలో ప్రయాణాలను విరమించుకోవడమే ఉత్తమం. గర్భధారణ సమస్యలు ఉన్నప్పుడు ప్రయాణాలు రద్దు చేసుకోవాలి. గర్భిణులు ఎక్కడికి వెళ్లినా మెడికల్ రిపోర్టులు, అత్యవసర ఫోన్ నంబర్లను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి.

సరైన రవాణా: వానాకాలంలో రైళ్లు, బస్సుల్లో ప్రయాణించడం ఇబ్బందికరం. విమానంలో ప్రయాణించేటప్పుడు ఎయిర్‌లైన్స్ నిబంధనలను తప్పకుండా తెలుసుకోవాలి. గర్భం దాల్చిన 36 వారాల తరువాత విమానంలో ప్రయాణించకపోవడమే మంచిది. సొంత వాహనాల్లో వెళ్లడమే సురక్షితం.

ముందే తెలుసుకోండి: ప్రయాణాలకు సిద్ధమయ్యే ముందే.. వాతావరణ పరిస్థితులను తెలుసుకోండి. వెదర్ యాప్స్, వెబ్‌సైట్లను పరిశీలించండి. భారీ వర్ష సూచనలు ఉన్నప్పుడు ప్రయాణం వాయిదా వేసుకోవడమే మంచిది.

సౌకర్యంగా ఉండండి: వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేసుకోవడం వల్ల.. ప్రయాణాల్లో సౌకర్యవంతంగా ఉంటుంది. వాటర్‌ప్రూఫ్ జాకెట్లు, గొడుగు కూడా వెంట ఉంచుకోవాలి. తడిగా ఉన్న చోట జారి కిందపడిపోకుండా.. యాంటి స్లిప్ చెప్పులు వాడండి.

శుభ్రత పాటించాల్సిందే: వానాకాలంలో ఎక్కువగా మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, జీర్ణ సంబంధ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే, పరిశుభ్రత తప్పకుండాపాటించాలి. చేతులుశుభ్రం చేసుకోవడానికి శానిటైజర్లు, టవల్స్, టిష్యూలు, టాయిలెట్ సీట్ డిస్ ఇన్‌ఫెక్టెంట్ స్ప్రే వెంట ఉంచుకోండి. పబ్లిక్ టాయిలెట్లకు వీలైనంత దూరంగా ఉండండి.

సమతుల ఆహారం: వానాకాలంలో బయటి ఆహారం తినకపోవడం మంచిది. ముందుగానే కోసిపెట్టుకున్న పండ్లు, సలాడ్లు, మూతలేకుండా ఉంచిన ఆహారం తినడం మంచిది కాదు. నూనె, మసాలాలు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తింటే.. లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఛాతీలో మంట, అజీర్ణం వంటివి ఇబ్బంది పెడతాయి. పరిశుభ్రమైన వాతావరణంలో చేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోండి.

# ఎన్‌ఆర్‌ఐ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా
# - కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 18, (తెలంగాణ దిశ) :** ఎన్‌ఆర్‌ఐ కాలనీలో అభివృద్ధి పనుల పూర్తికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం ప్రగతి నగర్ పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ సభ్యులతో కూడిన బృందం బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హన్మంత్ రెడ్డిని కలిసి తమ కాలనీ సమస్యలను వివరించారు. ప్రధానంగా సీనియర్ సిటిజన్స్ కల్చరల్ అసోసియేషన్ కాలనీలో ఓపెన్ జిమ్, క్రికెట్ గ్రౌండ్, పిల్లల ఆట స్థలాలు సంబంధించిన విషయంలో సహకరించాలని ఆయనను అభ్యర్థించారు. ఈ విషయంలో పూర్తిగా తగిన చర్యలు తీసుకునేటట్లు అధికారులను సంప్రదిస్తానని, పనులు పూర్తయ్యేటట్టు సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలేటి శ్రీనివాసరావు, సీనియర్ సిటిజన్స్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు హెచ్ జగన్మోహన్రావు, ప్రధాన కార్యదర్శి కాసర్ల శ్రీనివాసరావు, శేషబాబు, రామారావు, బాలచంద్రుడు, ఏ మాధవరావు, జి. దుర్గాప్రసాద్ రెడ్డి, డి. సత్యనారాయణ, ఆర్ కోటేశ్వరరావు, నేను నాగేశ్వరరావు, పి. ప్రసాద్, జె రామ్మోహన్ రావు, ఎం పున్నారావు, జి. శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# చేతులు లేకపోయినా ఫుడ్ డెలివరీ..

## సంపాదనలో కొంత మేర దానం
## పెదవులతో కస్టమర్లకు ఫోన్ కాల్స్
## ఆదర్శంగా నిలుస్తున్న చైనీయుడు





బీజింగ్ : చైనాలోని హునాన్ ప్రావిన్స్‌కు చెందిన లీ జియాంగ్యాంగ్ (30) అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. గ్రామీణ నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన నాలుగేళ్ల వయసులోనే విద్యుదాఘాతం వల్ల రెండు చేతులను కోల్పోయారు. దీంతో వారి కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తన వంతు సాయం చేయాలనే ఆలోచనతో ఎనిమిదేళ్ల వయసు నుంచి కాలిగ్రఫీ ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. తన కాలి వేళ్లతో కాలిగ్రఫీ వర్క్‌ను విక్రయించి, కొంత సొమ్ము సంపాదించేవారు. లీ మీడియాతో మాట్లాడుతూ, జరిగినదానిని మార్చలేమని, తాను ముందుకు సాగక తప్పదని చెప్పారు. తనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. పిల్లల్ని కిండర్‌గార్టెన్ స్కూల్లో చేర్పించవలసి ఉండటంతో తాను జూలై నుంచి పార్ట్ టైమ్ ఫుడ్ డెలివరీ ఏజెంట్‌గా పని చేస్తున్నానని తెలిపారు. యూనిసైకిల్‌పై కస్టమర్ల వద్దకు వెళ్లి, ఫుడ్‌ను అందిస్తానన్నారు. మోచేతికి కట్టుకున్న ఫోన్‌ను పెదవులతో ఆపరేట్ చేసి, కస్టమర్లకు కాల్ చేస్తానని తెలిపారు. రెస్టారెంట్ల సిబ్బంది, కస్టమర్లు తనకు సహకరిస్తున్నారన్నారు. కొందరు తనకు టిప్స్ కూడా ఇస్తూ ఉంటారని చెప్పారు.

# స్థల వివాదంలో ఎవరికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటాం






**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 18, (తెలంగాణ దిశ) :** వివాదంలో ఉన్న స్థలం డాక్యుమెంట్లను నిశితంగా పరిశీలించి ఎవరికీ అన్యాయం జరుగకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎస్ సీ, ఎస్ టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మల్కాజిగిరి మండలంలోని సర్వే నంబర్ 354 లో భూ వివాద స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల డాక్యుమెంట్లను వెరిఫికేషన్ చేసి పంచనామా తయారు చేసి నివేదికను కమీషన్ కార్యాలయానికి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఒక వర్గం వారు చూపించిన డాక్యుమెంట్లను పరిశీలించి ఎవరికీ అన్యాయం జరుగకుండా వాస్తవాలను పరిశీలించి తదుపరి చర్య తీసుకుంటామని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని వారి భూమిని వారికి ఇప్పిస్తామని భరోసా ఇచ్చారు.

# మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ గా కల్లోజీ రవి



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 18, (తెలంగాణ దిశ) :** మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ గా కల్లోజి రవి కుమార్ కు గురువారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్‌కొలన్ హన్మంత్ రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. గురువారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ మేరకు రవికి నియామక పత్రాన్ని అందించారు. గతంలో రవి క్రిస్టమస్ సెలబ్రేషన్స్ కు మాత్రమే సమన్వయం చేసే వారిని ప్రస్తుతం పూర్తిస్థాయిలో కో ఆర్డినేటర్ గా నియమించి బాధ్యతలు అప్పగించినట్లు హన్మంత్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా కల్లోజి రవికుమార్ మాట్లాడుతూ పార్టీ అప్ప చెప్పిన బాధ్యతలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు టి. లక్ష్మారెడ్డి, పెరిక శివ, రషీద్, గణేష్, జలీల్ ఖాన్, కె. జీవన్ రెడ్డి, పాస్టర్లు గొడి శేఖర్, దయానిధి తదితరులు పాల్గొన్నారు.

# అందం కోసం.. అవి వాడొద్దు



ఆడవాళ్లు అందానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందునా.. ముఖ వర్చస్సుకు మెరుగులు దిద్దుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇందుకోసం నానా రకాల సౌందర్య ఉత్పత్తులను ఆశ్రయిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్లకు క్యూ కడితే.. మరికొందరు ఇంటి చిట్కాలతోనే సరిపెట్టుకుంటారు. అయితే, కొన్ని సందర్భాల్లో తెలిసీతెలియకుండానే చిన్నచిన్న తప్పులు చేస్తుంటారు. ఏది పడితే అది ఇష్టారాజ్యంగా వాడేస్తుంటారు. అలా అందాన్ని చేతులారా పాడు చేసుకుంటారు. అలా కావొద్దంటే.. కొన్నిటిని పక్కన పెట్టేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాక్స్‌తో జాగ్రత్త!: ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవడానికి చాలామంది 'వ్యాక్స్'ను ఆశ్రయిస్తారు. అయితే, సరైనదాన్ని ఎంచుకోవడంలో పొరపాటు పడుతుంటారు. మహిళల చర్మతత్వాన్ని బట్టి 'వ్యాక్స్'ను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సున్నిత చర్మం ఉండేవారు.. కఠినమైన వ్యాక్స్‌ను వాడటం వల్ల ముఖ వర్ఛస్సు దెబ్బతింటుంది. ముఖంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ఫేషియల్ వ్యాక్స్ వేసుకునే ముందు.. ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలని చెబుతున్నారు.

నిమ్మ..అలా వద్దు!: ఆరోగ్యంతోపాటు అందాన్ని కాపాడటంలోనూ 'నిమ్మ పండు' ముందుంటుంది. అయితే, చాలామంది దీనిని నేరుగా ముఖంపైనే అప్లయి చేస్తుంటారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరం. నిమ్మకాయలో ఉండే అధిక ఆమ్లత్వం.. చర్మానికి హాని కలిగిస్తుంది.

# లోకేష్ పేరును వదలని సైబర్ చీటర్స్



**విజయవాడ,తెలంగాణ దిశ :** సైబర్ నేరాల తీరు మారుతోంది. ఇప్పటివరకు సామాన్యులే టార్గెట్ అయ్యేవారు. ఇప్పుడు సెలబ్రిటీలను సైతం వదలడం లేదు. వీఐపీల పేర్లు, ఫోటోలు వాడుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మొన్న మధ్యన రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరిని టార్గెట్ చేసి కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్ పేరుతో 57 లక్షల రూపాయలు కొల్లగొట్టేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏపీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇది సంచలన అంశంగా మారింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.ఏపీకి చెందిన ఓ వ్యాపారికి.. మంత్రి నారా లోకేష్ ప్రొఫైల్ పిక్చర్ గా ఉన్న ఓ వాట్సప్ నుంచి సమాచారం వచ్చింది. కీలకమైన ప్రాజెక్టులకు డబ్బు అవసరం ఉందని చెప్పి.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఫోన్ కాల్ చేసి అచ్చంగా మంత్రిగా మాట్లాడారు. అయితే అది నిజమేనని భావించిన సదరు వ్యాపారి పలు విడతల్లో 57 లక్షల రూపాయల వరకు అలా బెదిరించిన వ్యక్తులకు పంపించాడు. చివరకు ఇది మోసంగా భావించి ఏపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడు రాజేష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో హైదరాబాదులో సాయి శ్రీనాథ్, సుమంత్ అనే ఇద్దరు వ్యక్తులను హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈ ఘటన వెనుక పెద్ద ముఠా హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలను టార్గెట్ చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.కొద్ది రోజుల కిందట ఖమ్మం జిల్లా టిడిపి నేతలను ఇలానే సైబర్ నేరగాళు దోచుకున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేరుతో వాట్సాప్ కాల్ చేశారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి నిధులు కావాలని.. అందుకు విరాళాలు అందించాలని కోరడంతో కొందరు నేతలు నగదు పంపించారు. అదే సమయంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల్లో బీఫారాలు కావాలంటే కొంత మొత్తం చెల్లించాలని కోరడంతో.. రెండోసారి కూడా సదరు నేతలు నగదు జమ చేశారు. అమరావతి వస్తే పార్టీ అధినేత చంద్రబాబుతో బీఫారాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. విజయవాడలో వారి పేరుతో హోటళ్లు కూడా బుక్ చేశారు. దీంతో ఇది నిజమని నమ్మిన నేతలు విజయవాడ వెళ్లి హోటల్లో దిగారు. అయితే అక్కడ బిల్లు చెల్లించే క్రమంలో వివాదం జరిగింది. తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని గుర్తించిన సదరు నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేశారు. బయటకు చెబితే పరువు పోతుందని భావించారు. ఇంకోవైపు రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరు హైదరాబాదులో ఇలానే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. అయితే ఇప్పుడు మంత్రి నారా లోకేష్ పేరు చెప్పి సైబర్ నేరానికి పాల్పడడంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందుకే కేసును ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# రాష్ట్రేతర కార్మికులతో పనులు చేస్తే నాణ్యత లోపాలు



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** రాష్ట్రేతర, ఇతర జిల్లాల నుంచి వస్తున్న మార్బుల్ అండ్ టైల్స్ కార్మికుల వల్ల పనుల్లో నాణ్యత లోపాలు ఎదురవుతున్నాయని శ్రీ రాజరాజేశ్వర మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి రవి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శ్రీ రాజరాజేశ్వర మార్బుల్ అండ్ టైల్స్ అసోసియేషన్ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు తాండ్ర సదానందం,జిల్లా అధ్యక్షులు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి భవన యజమానులకు, కార్మికులకు కీలక అంశాలను వెల్లడించారు.యూనియన్‌లో పనిచేసే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా యూనియన్ గుర్తింపు కార్డు తీసుకోవాలని, ప్రతి నెలా సమావేశం నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని తాండ్ర సదానందం స్పష్టం చేశారు. ప్రధానంగా,యూనియన్ నిర్ణయించిన ధరలకు మాత్రమే పనులు చేయాలి తప్ప, ఆ ధరలను తగ్గించి పని చేయడం వలన నాణ్యత లోపిస్తుందని ఆయన హెచ్చరించారు. ఇంటి యజమానులు తక్కువ రేటుకు పనిచేసేవారిని ఆశ్రయిస్తే భవిష్యత్తులో రిపేర్లకు గురికావాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యను నివారించేందుకు వచ్చే జనవరి 2026 నుంచి మార్బుల్ పనులకు కొత్త ధరలను యూనియన్ నిర్ణయిస్తుందని, ఆ ధరల ప్రకారమే యజమానులు పనులు చేయించుకోవాలని కోరారు. పని ఇచ్చేటప్పుడు కార్మికుల వద్ద యూనియన్ కార్డును పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, తక్కువ ధరలకు పని చేయించుకుంటే తలెత్తే సమస్యలకు యూనియన్ బాధ్యత వహించదని ఆయన స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి రవి మాట్లాడుతూ రాష్ట్రేతర, ఇతర జిల్లాల నుంచి వస్తున్న కార్మికుల వల్ల నాణ్యత లోపాలు ఎదురవు తున్నందున,రాజరాజేశ్వర అసోసియేషన్ యూనియన్ కార్డు ఉన్నవారికి మాత్రమే ఇంటి పనులు అప్పగించాలని భవన యజమానులకు విజ్ఞప్తి చేశారు.ఇంటి ఇంటీరియర్ పనిలో నాణ్యత చాలా ముఖ్యమని, లక్షల రూపాయలు వెచ్చించి ఇల్లు కట్టుకునే యజమానులకు లోపాలు ఉన్న పనుల వల్ల ఇబ్బంది కలగకూడదని అన్నారు.ఇటీవల పని నాణ్యత సరిగా లేదని ఫిర్యాదులు అందాయని, యూనియన్‌లో లేని కార్మికులు సగం పనులు చేసి విడిచిపెట్టి వెళ్తున్నారని ఆయన వివరించారు. యూనియన్ కార్డు స్పష్టం చేస్తూ, రాబోయే రోజుల్లో,కార్డు లేని కార్మికులు పూర్తి చేసిన భవనాలకు నిర్వహణ పని తమ యూనియన్ సభ్యులు చేయరని,చేయనివ్వరని కరాఖండిగా హెచ్చరించారు. ఇంటి యజమానులు ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కోకుండా ఉండేందుకు ఈ నిబంధనలను తప్పక పాటించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా కల్లెపెల్లి మోహన్,సంయుక్త కార్యదర్శి దొమ్మటి రాజేష్,ఉపాధ్యక్షులు గడ్డం మధు,కోశాధికారి గడ్డం తిరుమల్,సహాయ కోశాధికారి లోకేష్ మీనా,ప్రచార కార్యదర్శి మిరియాల రవీందర్ రావుతో పాటు యూనియన్ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

# పాత జిల్లాలోనే కలిపేయండి

**కర్నూలు,తెలంగాణ దిశ :**ఏపీలో జిల్లాల పునర్విభజన వేళ డోన్ నియోజకవర్గ ప్రజలు తమను నంద్యాల నుంచి కర్నూలు జిల్లాలో కలపాలని కోరుతున్నారు. వైద్య, ఉపాధి అవసరాలకు కర్నూలు దగ్గరగా ఉండటమే దీనికి కారణం. గతంలోనూ కర్నూలు జిల్లాలోనే ఉన్న డోన్ వాసులు, ఈ మార్పు తమకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజన, మండలాల పునర్విభజనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో డిమాండ్ తెరపైకి వచ్చింది. తమను నంద్యాల జిల్లా నుంచి తీసుకెళ్లి కర్నూలు జిల్లాలో కలిపేయాలని డోన్ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. డోన్ నియోజకవర్గం నంద్యాల జిల్లాలో కలపడాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో డోన్ నియోజకవర్గం కర్నూలు జిల్లాలోనే ఉండేది. దీంతో డోన్ వాసులు చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా కర్నూలులోని పెద్దాసుపత్రికి వెళ్లేవారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగులు, కూలీలు కూడా ఉపాధి, ఉద్యోగాల కోసం కర్నూలుకు వెళ్లేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లాలోకి విలీనం అయింది. ఈ మార్పును వ్యతిరేకిస్తూ అప్పట్లోనే ప్రజలు అనేక విజ్ఞప్తులు చేశారు.డోన్ నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు. 2 లక్షలకు పైగా ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో, డోన్ పట్టణ, మండలాల నుంచి 90 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. చారిత్రాత్మకంగా, డోన్ ప్రాంతం నుంచి ఎన్నికైనవారు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులు కూడా చేపట్టారు. ప్రస్తుతం, డోన్‌ను కర్నూలు జిల్లాలో కొనసాగించాలని కోరుతున్నారు. డోన్ నుంచి కర్నూలుకు హైవే మార్గంలో కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.. 50 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అయితే నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 90 కిలోమీటర్లు ప్రయాణించి గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది.డోన్ ప్రాంత ప్రజలు వైద్య అవసరాల కోసం, ఉపాధి అవకాశాల కోసం కర్నూలు దగ్గరగా ఉండటంతో అక్కడికే వెళ్లడం సౌకర్యంగా ఉందంటున్నారు. నంద్యాలకు కేవలం జిల్లా అధికారులతో పనులుంటేనే వెళ్తున్నారట. ప్యాపిలి మండల ప్రజలు కూడా తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే ఉంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. డోన్, ప్యాపిలి ప్రాంతాల ప్రజల్లో 95 శాతం మందికి పైగా తమ ప్రాంతాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు.డోన్ ప్రజలు కోరుకున్నట్లుగానే కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో కూడా హామీ ఇచ్చామని.. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం, ముఖ్యమంత్రికి సైతం లేఖను అందజేశామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ లోపు ఈ జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. మరి డోన్‌వాసుల రిక్వెస్ట్‌ను పరిగణలోకి తీసుకుంటారలో లేదో చూడాలి. మరి డోన్ ప్రజల రిక్వెస్ట్‌పై ప్రభుత్వం, కేబినెట్ సబ్ కమిటీ ఎలా స్పందిస్తుందో చూడాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని డోన్‌వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఒంగోలు పట్టణ వ్యాపారుల లబోదిబో

## వరదలతో పూర్తిగా కొట్టుకుపోయిన సరుకులు

## ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

**ఒంగోలు,తెలంగాణ దిశ :**మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాను అతలాకుతలం చేశాయి. అన్నదాతలతో పాటు, సామాన్యులు కూడా దెబ్బతిన్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారుల అవస్థలు చెప్పలేం. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథగా ఉంది. చిరు వ్యాపారులను తుఫాన్ వర్షం నిలువునా ముంచింది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో ఊహించని విధంగా భారీఎత్తున వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కిరణా సామగ్రి విక్రయదారులు, దర్జీలు, తినుబండరాలు అమ్మేవారు, మోటారు మెకానిక్‌లు ఇలా చేతివృత్తులదారులందరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. అల్పపీడనం, అనంతరం మొంథా తుపాను ప్రభావంతో గత పది రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగాయి. వర్షాలకు జన సంచారం తగ్గి అమ్మకాలు సాగక చిరు వ్యాపారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. తొలుత ఎలాంటి వరద లేకపోవడంతో ఎప్పుడూ వచ్చే మాదిరి వరద నీరు వచ్చి పోతుందని పెద్దగా జాగ్రత్తలు తీసుకోలేదు. చాలామంది సామగ్రి సర్దుకోలేదు. చాలామంది దుకాణం ఒకచోట, నివాసం మరోచోట ఉండటంతో సామగ్రిని భద్రపరచుకోలేకపోయారు. భారీఎత్తున వరద నీరు చుట్టుముట్టేయడంతో దుకాణాల్లో నీరు చేరింది. దీంతో సామగ్రి పూర్తిగా తడిసిపోయి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. వరదతో దుకాణంలో బురద మేటలు వేసిందని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. వస్తువులను తయారు చేసే చిన్న ఖార్ఖానాలను వరద నీరు ముంచెత్తడంతో వారంతా నష్టపోయారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువను ఆనుకుని ఉన్న కాలనీల్లో చిరు వర్తకులకు తీవ్ర నష్టం ఎదురైంది. నష్టాన్ని పరిశీలించి తమకు సాయం చేయాలని వారంతా కోరుతున్నారు. ఒంగోలు నగరం మొంథా దెబ్బకు జలవిలయాన్ని సృష్టించంది. నగరం మొత్తం నీట మునిగింది. దీంతో చిన్నాచితక వ్యాపారాలు చేసేవారి సామాగ్రి నీట మునిగిపోవడం లేదా కొట్టుకుపోవడం జరిగింది. బలరాం కాలనీకి వెళ్లే దారిలో వంతెన వద్ద సమోసాలు హోల్‌సేల్‌గా విక్రయించే దుకాణంలో పిండి బస్తాలు తడిచిముద్దయి పనికి రాకుండాపోయాయి. ఇదే ప్రాంతంలో పాత సామగ్రి కొనుగోలు దుకాణంలోని మొత్తం సరకు కొట్టుకుపోయినట్లు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా మోకాలి లోతున నీళ్లు వస్తుంటాయని, ఆమేర జాగ్రత్త పడతామని ఈసారి ఊహించని విధంగా వరద ముంచేసిందని ఓ కిరాణా వ్యాపారి వాపోయారు. ఇటీవల కాలంలో ఇంత వరద తామెప్పుడూ చూడలేదని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

# జగన్ నేతలకు అల్టిమేటం జారీ చేశారా

**విజయవాడ,తెలంగాణ దిశ :** వైసీపీ అధినేత జగన్ పార్టీనేతలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. ఎవరికి వారే నిర్ణయాలు ప్రకటించడం ఇప్పుడు పార్టీలోనే కాదు రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ప్రాంతీయ పార్టీ అంటే అధినేత ఆలోచనలను పసిగట్టి నేతలు మసులుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు నేతలు కట్టు తప్పుతున్నారని పార్టీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. జగన్ ఆలోచనల ప్రకారం నేతలు నడుచుకోవడం లేదనడానికి ఇటీవల జరిగిన అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్ కు దూరంగా ఉండటంతో పాటు నేతలతో తరచూ సమావేశాలు కాకపోవడం వల్లనే ఈ రకమైన ఇబ్బందులు పార్టీలో తలెత్తుతున్నాయన్నది వాస్తవం. అందుకే ఆయన కనిపించరట 2019 ఎన్నికలకు ముందు... 2019 ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాట వేదవాక్కుగా నడిచేది. ఏ నిర్ణయమైనా అంతసులువుగా బయటకు చెప్పే వారు కాదు. కేవలం సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే జగన్ తో మాట్లాడి వచ్చిన తర్వాత పార్టీ, ప్రభుత్వ ఆలోచనను ప్రజల ముందుంచేవారు. ఇక 2019 ఎన్నికల్లో పూర్తిగా జగన్ ఫొటోతోనే గెలిచామన్న భావనలో ఉన్న నేతలు పార్టీ నిర్ణయాలను తప్పుపట్టే సాహసం చేసేవారు కాదు. అందులో నిజం ఉందని చాలా మంది బహిరంగంగా అంగీకరించేందుకు కూడా మొహమాట పడేవారు కాదు. కాని ఎప్పుడైతే జగన్ అధికారానికి దూరమయ్యారో అప్పటి నుంచి అధినేతను కూడా లెక్క చేయని పరిస్థితి నేతల్లో కనిపించడం పార్టీ నాయకత్వంలో ఆందోళన కలిగిస్తుంది. అమరావతి రాజధాని విషయంలోనూ అదే జరిగింది.

# మూసీ ప్రక్షాళనకు అడగడుగునా అడ్డంకులు..?



**నల్గోండ,తెలంగాణ దిశ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన మూసీ ప్రాజెక్ట్ ఆధునీకరణకు నోచుకోక అంధకారంలో కొట్టుమిట్టాడుతుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మూసీ ప్రాజెక్టు పరిస్థితి ఉంది. సోలిపేట గ్రామం వద్ద మూసీనదిపై 1954 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1963 సంవత్సరంలో పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన ఐదేళ్ల వరకు ఎడమ కాలువ 41 కిలోమీ టర్లు, కుడికాలువ 38 కిలోమీటర్ల పొడవున మొత్తం 42 గ్రామాల రైతులకు సాగునీరందించింది.ప్రస్తుతం ప్రాజెక్టులో పూడిక పెరిగిపోవడంతో 30 వేల ఎకరాలకు ఆయకట్టుకు పడిపోయింది. పాలకులు మారుతున్న మూసీ ప్రాజెక్టు పై నిర్లక్ష్యం మాత్రంవీడటం లేదు. ప్రాజెక్టు మీద నిర్మించిన రక్షణ గోడలకు రక్షణ లేకుండా పోయింది.. వెదురు కర్రలేదిక్కయ్యాయి. పర్యాటకులతో, అతిధులతో కిటకిటాడాల్సిన అతిథిగృహం శిధిలావస్థలో ఉంది. క్లస్టర్ గేట్ల నుండి ,ప్రాజెక్టు రక్షణ గోడల నుండి నుండి నీరు లీకేజ్ అవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు.ప్రాజెక్టుపై ఆరుగురు పర్మనెంట్ ఉద్యోగులు, నలుగురు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేటాయించే నిధులు సరిపోక మరమ్మతులు పూర్తి స్థాయిలో జరగటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు మూసీ ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునీకరణకు పూనుకొని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారుమూసి ప్రాజెక్ట్ 6700 ఎకరాలలో విస్తరించి ఉంది 4.46 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ప్రాజెక్ట్ రోజురోజుకు పూడిక పెరగడంతో సామర్థ్య స్థాయి తగ్గిపోతుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడెనీ నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది.కుడి కాల్వ పరిధిలో కేతేపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, వేములపల్లి మండలాల్లో 23 చెరువులు, ఎడమ కాలువ పరిధిలో సూర్యాపేట, చివ్వెంల, పెన్ పహాడ్ మండలాల్లో 22 చెరువులు ఉన్నాయి. కాలువలకు నీటిని విడుదల చేసి నట్లయితే చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండుతాయి. కుడి, ఎడమ కాల్వల కు నీటిని విడుదల చేస్తే ఆయకట్టు పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల ఎకరాల భూము లు సాగులోకి రానున్నాయి. ప్రాజెక్టు మీద ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు శిథిలవస్థకు చేరాయి. రక్షణ గోడలకు మరమ్మత్తులు చేపట్టలేదు. రక్షణ గోడలు శిథిలమైన స్థానంలో కర్రలు కట్టి మమ అనిపించారు. ప్రాజెక్టు కు సందర్శకులు వచ్చినప్పుడు వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వెదురు కర్రలు విరిగే ప్రమాదం ఉంది. మూసీ ప్రాజెక్టుకు 30 స్కవర్, క్రష్, రెగ్యులేటర్ గేట్లు ఉన్నాయి. వీటిలో 10 స్కవర్ గేట్లను శాశ్వతంగా మూసివేశారు. ఎనిమిది క్రష్ గేట్లలో మూడు గేట్ల నుండి నీరు లీకేజీ రూపంలో వాగులోకి వెళ్తుంది. దశాబ్దన్నర కాలంగా గేట్ల నుంచి నీరు లీకేజి అవుతున్న మరమ్మతులకు నోచుకోలేదు. మూసీ ప్రాజెక్టు డ్యాం గేట్లు ముగిసిన తర్వాత ఉన్న ప్రాంతంలో డ్యాం గోడల నుంచి సైతం నీరు లీకేజీల రూపంలో ప్రవహిస్తుంది. ఈ లీకేజీలు సంవత్సరాల తరబడి అవుతున్న పట్టించుకోవడం లేదు. లీకేజీల వెంబడి చెట్లు పెరిగి ఆ గోడను మరింత బలహీన పరుస్తున్న పరిస్థితి ఉంది.గతంలో పర్యాటకులు, అతిధులతో కలకలలాడిన అతిథి గృహం నేడు వెలవెలబోతుంది. అతిథి గృహానికి మరమ్మత్తులు లేక శిధిలవస్థకు చేరుతుంది. అతిథి గృహం, గేట్లకు కలర్స్, ఇతర మరమ్మతుల కోసం రూ.4 కోట్ల తో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. డ్యాం రక్షణ, మరమ్మతుల కోసం నుండి సాంక్షన్ ఆర్డర్స్ వచ్చాయి కానీ సాంక్షన్ ఆర్డర్స్ వచ్చిన టెండర్లకు ఎవరు ముందుకు రాలేదని త్వరలో మళ్లీ టెండర్ వేసి మరమ్మతులు చేపడతామని ప్రాజెక్టు డి ఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రెండో ప్రాజెక్ట్ అయిన మూసి ప్రాజెక్టును పర్యటకేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణం, పర్యాటకుల సందడి, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి, చుట్టుపక్కల ప్రకృతి అందాలు పర్యాటక కేంద్ర అభివృద్ధికి కావలసిన అన్ని అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# దశ, దిశను మార్చే గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ, : అండమాన్ నికోబార్ సముద్రప్రాంతాల్లో భారత్‌కు కీలక ద్వీపం. కొన్ని రోజులుగా ఈ ద్వీపం వార్తల్లో నిలుస్తోంది. కారణం.. గ్రేట్ నికోబార్ ప్రాజెక్టు. దేశానికి వ్యూహాత్మక మని, అభివృద్ధికి కీలకంగా మారుతుంది అని కేంద్రం చెబుతోంది. ఇక విపక్షాలు మాత్రం దీనిని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. పర్యావరణ హాని అంటూ 70 మంది మేధావులు కేంద్రానికి లేఖ రాశారు. ఇక బీజేపీ మాత్రం దీనిని చైనా ప్రేరేపిత చర్యగా ఆరోపిస్తోంది.నీతి ఆయోగ్ రూపకల్పన చేసిన 81 వేల కోట్ల రూపాయల ఈ ప్రాజెక్టులో అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టు, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, టౌన్‌షిప్, గ్యాస్‌సోలార్ విద్యుత్ ప్లాంట్ వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఇవి అన్నీ కలిపి గ్రేట్ నికోబార్‌ను వ్యూహాత్మక, ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నం. మలక్కా జలసంధి నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ద్వీపం సముద్ర భద్రతలో కీలకం. అక్కడ నేవీఎయిర్‌ఫోర్స్ శాశ్వత స్థావరం ఏర్పడితే, భారత్ ఇండో?పసిఫిక్‌లో కీలకంగా మారుతుంది. చైనా ఆధిపత్యానికి చెక్ పడుతుంది. చైనా చేపడుతున్న 'స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్' వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు ఇది వ్యూహాత్మక అడుగుగా భావిస్తున్నారు.సింగపూర్



వంటి పోర్టులతో పోటీ ఇవ్వగల ఈ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్టు ద్వారా ప్రపంచ కంటైనర్ వాణిజ్యంలో భారత్ కొత్త హబ్‌గా ఎదగవచ్చు. స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు, పర్యాటకంగా దీవుల ఆదరణ పెరగడం వంటి లాభాలు కూడా ఉన్నాయని కేంద్రం చెబుతోంది. మొదటి దశ పనులు 2028 కల్లా పూర్తవుతాయని అంచనా.ఇదే ప్రాజెక్టుపై విపక్షం మొత్తం వ్యతిరేకత తెలుపుతోంది. గలతియా బే సమీప సముద్రతీరంలో తాబేళ్ల గుడ్ల ప్రాంతానికి నష్టం, లక్షల చెట్ల నరికివేత, సముద్ర జీవాల అంతరాయం వంటి అనేక పర్యావరణ సమస్యలు ప్రస్తావించబడుతున్నాయి.

 Volume : 3 Issue No. 163 తెలంగాణ దిశ FRIDAY,DECEMBER,19,2025 శుక్రవారం,డిసెంబర్,19,2025

# భారత జనాభాలో 2080 నాటికి స్థిరత్వం..



**సంతానోత్పత్తి రేటు తగ్గుదలే కారణం!**

**అప్పటికి 180-190 కోట్లు ఉండవచ్చు**

**సంతానోత్పత్తి రేటు పతనమే కారణమన్న ఐఏఎస్‌పీ అధ్యయనం**

న్యూఢిల్లీ: భారత దేశ జనాభా 2080 నాటికి 180-190 కోట్ల వద్ద స్థిరపడవచ్చు. రీప్లేస్‌మెంట్ లెవెల్ (పునఃభర్తీ స్థాయి) కన్నా తక్కువకు సంతానోత్పత్తి రేట్లు (Fertility Rate) నిలకడగా పతనమవుతుండటమే ఇందుకు కారణం. ఇండియన్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ పాపులేషన్ (IASP) తాజా అధ్యయనం ఈ వివరాలను వెల్లడించింది. ఐఏఎస్‌పీ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్రన్ తెలిపిన వివరాల ప్రకారం, 20 ఏళ్ల నుంచి జననాల రేట్లు బాగా తగ్గిపోతున్నాయి. 2000వ సంవత్సరంలో టోటల్ ఫెర్టిలిటీ రేటు 3.5 కాగా, నేడు అది 1.9కి పడిపోయింది. 2080నాటికి మన దేశ జనాభా 180-190 కోట్ల మధ్య ఉండవచ్చు. ఆ తర్వాత స్థిరపడటం ప్రారంభమవుతుంది. మొత్తం మీద భారతదేశ జనాభా 200 కోట్లు లోపుగానే ఉండవచ్చునని అన్ని అంచనాలు చెప్తున్నాయి. సంతానోత్పత్తి రేటు తగ్గుదల..: సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడానికి కారణాలేమిటంటే, అభివృద్ధి, విద్యా స్థాయిలు పెరుగుతుండటమేనని చంద్రన్ చెప్పారు. మహిళలు విద్యావంతులవుతుండటంతో పెళ్లి, పిల్లల్ని కనడం, కుటుంబం పరిమాణంపై నిర్ణయాలు తీసుకోవడంపై వారి ప్రభావం పడుతున్నదన్నారు. గర్భనిరోధక సాధనాలు అందుబాటులో ఉండటం, సంతానోత్పత్తిని నియంత్రించే పద్ధతులు విస్తృతంగా ఉండటం కూడా సంతానోత్పత్తి తగ్గుదల వేగవంతమవడానికి దోహదపడుతున్నదన్నారు. ఈ రోజుల్లో దంపతులకు మెరుగైన సమాచారం అందుబాటులో ఉంటున్నదని, ఎప్పుడు, ఎందరు పిల్లల్ని కనాలో నియంత్రించుకుంటున్నారని తెలిపారు. ఆలస్యంగా పెళ్లి జరగడం, ఆర్థిక అవకాశాలు విస్తరించడం, ముఖ్యంగా మహిళలు ఉన్నత చదువులు చదువుతుండటం, కెరీర్‌లో ఎదుగుతుండటం వంటి వాటి వల్ల పునరుత్పాదన విధానాలు మారుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పెరిగితే, సంతానోత్పత్తి రేటు తగ్గుతున్నదన్నారు. నిరక్షరాస్యుల్లో ఇప్పటికీ సంతానోత్పత్తి రేటు మూడు కంటే ఎక్కువగా ఉంటున్నదని, విద్యావంతుల్లో 1.5 నుంచి 1.8 ఉంటున్నదని చెప్పారు. కేరళ రాష్ట్రం 1987-1989 నాటికి పునఃభర్తీ రేటు 2.1ని సాధించిందని, ప్రస్తుతం ఇది 1.5కు పతనమైందని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో కూడా టోటల్ ఫెర్టిలిటీ రేటు చాలా తక్కువగా ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణ మెరుగుపడటంతో ఆయుష్షు పెరుగుతున్నదని, 60 ఏళ్లు పైబడి జీవిస్తున్నవారు పెరుగుతున్నారని తెలిపారు. యువత ఉపాధి కోసం వలస పోతుండటంతో వృద్ధుల సంరక్షణ విషయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. వయోవృద్ధులకు డే కేర్ సర్వీసుల పట్ల ఆకర్షణ పెరుగుతున్నట్లు తెలిపారు.

# అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలు

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం ఆయనకు అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలుగా మారే అవకాశాలున్నాయి. నిధుల కొరతతో పాటు సంక్షేమాన్ని అమలు చేయడం కత్తిమీద సాముగా మారింది. ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్న ప్రయత్నంలో ఆయన ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పేశారు. మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయలు ఆడబిడ్డ పథకం కింద.. నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రతిపక్ష వైసీపీ పదే పదే గుర్తు చేస్తుంది.రెండు పథకాలు అమలు చేయాలంటే అంత సులువు కాదు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ప్రభుత్వానికి చెందిన ఆస్తులు అమ్మాల్సిందేనని అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అర్హులు ఎందరు? ఎవరికి ఇస్తారన్న దానిపై పథకం క్లిక్ అయ్యేది ఆధారపడి ఉంటుంది. ఏదో కొందరికి ఇచ్చామని మమ అనిపించడానికి వీలులేదు. మహిళల్లో ఒకరికి వచ్చి పది మందికి పథకం రాకపోతే ఇరవై మంది వ్యతిరేకమవుతారు. నిరుద్యోగ భృతి కూడా అంతే. అది అమలుకు సాధ్యమయ్యే హామీ కాదు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వాలంటే ఖజానా సరిపోదు. అందుకే చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గతంలో సంక్షేమంపై చంద్రబాబు ఎన్నడూ ఇలా టెన్షన్ పడలేదు. ఆయన దృష్టంతా అభివృద్ధిపైనే ఉంది. గత ప్రభుత్వం అప్పులు చేసిందని, విధ్వంసం నుంచి బయటపడేస్తున్నామని చెప్పాలనుకున్నా కుదిరే పని కాదు. ఎందుకంటే ఇప్పటికే రెండేళ్ల సమయం పూర్తయింది. ప్రస్తుతం గ్రౌండ్ చేసిన హామీలను అమలు చేయడానికే అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రతి నెల అప్పుల కోసం ఢిల్లీ వైపు చూడాల్సి వస్తుంది. మరొకవైపు రాజధాని నిర్మాణం, పోలవరం పూర్తి చేయడం వంటివి కూడా సవాలుగా మారుతున్న సమయంలో చంద్రబాబు నాయుడు ఈ రెండు పథకాలను అమలు చేయడానికి అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి తలకిందులు తపస్సు చేసినా సాధ్యం కాదన్నది ప్రతిపక్షం ఆలోచన. అందుకే ఆరెండింటిపైనే ఎక్కువగా విమర్శలు చేస్తున్నారు. మరి చంద్రబాబు ఈ రెండు పథకాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి

# 3 లక్షల కోట్లు దాటిన వైజాగ్ డేటా సెంటర్

విశాఖపట్టణం, : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ల హబ్గా రూపుదిద్దుకుంటోంది. టెక్ దిగ్గజాలు, ప్రపంచ స్థాయి సంస్థలు ఇక్కడ డేటా సెంటర్ల ఏర్పాటుకు క్యూ కట్టడంతో, మొత్తం పెట్టుబడులు ఏకంగా రూ. 3 లక్షల కోట్లకు పైగా చేరినట్లు తెలుస్తోంది.తాజాగా ఈ పెట్టుబడుల సునామీకి ఊతం ఇస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో భారీ అడుగు వేసింది. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ , డిజిటల్ రియాల్టీ వంటి సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన 'డిజిటల్ కనెక్షన్' విశాఖలో ఒక గిగావాట్ సామర్థ్యం గల అత్యాధునిక ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనుంది.ఈ ప్రాజెక్టుకోసం రిలయన్స్ జాయింట్ వెంచర్ సుమారు రూ. 98,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. 2030 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. రిలయన్స్‌తో పాటు ఇప్పటికే ప్రపంచ దిగ్గజ సంస్థలు విశాఖలో భారీ పెట్టుబడులు ప్రకటించాయి. దాదాపు రూ. 1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో 1ఉచి సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్. రూ. 1.10 లక్షల కోట్లతో డేటా సెంటర్ల నిర్మాణం. రూ. 16,000 కోట్ల పెట్టుబడితో 550 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్ల కాంప్లెక్స్. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ఏర్పాటు, సిఫీతో కలిసి 500 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ (రూ. 15,266 కోట్లు)మొత్తంగా, రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి 6,000 మెగావాట్ల డేటా సెంటర్‌ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 3.65 గిగావాట్లకు పైగా ఒప్పందాలు కుదిరాయి. ఈ భారీ పెట్టుబడులతో విశాఖపట్నం రానున్న రోజుల్లో భారతదేశ 'డేటా రాజధాని'గా అవతరించడం ఖాయమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని ద్వారా వేల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు, నూతన సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా వైజాగ్ మారనుంది.

# ఆ మూడు ఆస్పత్రులకు మంచి రోజులు

గుంటూరు, : ప్రజారోగ్యం, ఆసుపత్రుల అభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా మూడు ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. పిఠాపురం, మంగళగిరి, చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ఏపీ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి 22 కోట్ల 74 లక్షల రూపాయలు అదనపు నిధులు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల అయ్యాయి.ప్రజారోగ్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కీలక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పన, అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మూడు నియోజకవర్గాలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రాష్ట్రంలోని మూడు ఏరియా ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి ఏపీ ప్రభుత్వం ఈ మేరకు రూ.22.74 కోట్లు అదనపు నిధులు కేటాయించింది. మంగళగిరి. పిఠాపురం ఏరియా ఆస్పత్రి , చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు ఏపీ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు మంగళగిరి ఏరియా ఆస్పత్రి సామర్థ్యం ప్రస్తుతం 30 పడకలు మాత్రమే. ప్రజా అవసరాల నేపథ్యంలో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని.. ఈ ఆస్పత్రికి అదనంగా 73 పోస్టులు కేటాయించాలని నిర్ణయించారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా అదనపు పడకలు, అదనపు పోస్టుల కోసం రూ.52.20 కోట్లు కూడా కేటాయించారు. అలాగే మంగళగిరి ఏరియా ఆస్పత్రిని చినకాకాని వద్ద ఉన్న వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో నిర్మించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం పాడవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు మంత్రి నారా లోకేష్ మంగళగిరి ఏరియా ఆస్పత్రి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఆస్పత్రిని కార్పొరేట్ వసతులతో నిర్మించాలని.. అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని అధికారులకు ఇప్పటికే సూచనలు చేశారు. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్.. రెండు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. రోగులకు ఉపయోగపడేలా ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. విశాలమైన పార్కింగ్ స్థలం కేటాయించనున్నారు. ఈ ఏరియా ఆస్పత్రికి మంగళగిరి నియోజకవర్గం నలుమూలల నుంచి చికిత్స కోసం ప్రజలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రోగులతో పాటుగా వారి బంధువుల కూడా అసౌకర్యం కలగకుండా వసతి ఏర్పాట్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనితో పాటుగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం ఏరియా ఆస్పత్రికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

# ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ...



కరీంనగర్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా సీవీఎం కళాశాల విద్యార్థులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే పార్కు నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన తెలంగాణ చౌరస్తా, ప్రతిమ మల్టిప్లెక్స్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రమణాచారి మాట్లాడుతూ, ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ ఈ సంవత్సరం నిర్ణయించిన థీమ్ ఓవర్‌కమింగ్ డిస్రప్షన్, ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఎయిడ్స్ రెస్పాన్స్ అని గుర్తుచేశారు. వ్యక్తిత్వ వికాసం, నీతి- నిబంధనలకు కట్టుబడి ఉండడం వంటి జీవన విలువలు ఎయిడ్స్ వంటి వ్యాధులను నివారించడంలో కీలకమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అకుల శైలజ మాట్లాడుతూ, ఎయిడ్స్ సోకిన కుటుంబాలు ఇప్పటికీ సమాజంలో వివక్షను, సామాజిక ముద్రను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారు పడుతున్న మానసిక- సామాజిక సమస్యలను సమాజం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిడ్స్ గుర్తింపు, చికిత్స కోసం అందుబాటులో ఉన్న యాంటీ రెట్రోవైరల్ చికిత్స (ఏఆర్‌టీ ) సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు డాక్టర్ వర్షి, డాక్టర్ నీలిమ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డర్మాటాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజిబాబు, డాక్టర్ రమేష్ కొల్లూరి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ సునీల్ రెడ్డి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ గీతా రెడ్డి, డాక్టర్ రవికాంత్, డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ ఆదేపు సైలజ, సీవీఎం చైర్మన్ డాక్టర్ చాట్ల శ్రీధర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్‌లో 18 రోజులు బ్యాంకులు బంద్..




హైదరాబాద్:ఈ ఆర్థిక సంవత్సరంలో మరో నెల ముగిసిపోయింది. డిసెంబర్‌లో దాదాపు 18 రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. ఈ మేరకు ఆర్బీఐ బ్యాంకుల సెలవులకు సంబంధించిన జాబితాను విడుదల చేసింది. ప్రతి నెలా బ్యాంకులకు సెలవులు ఉండే విషయం తెలిసిందే. ఏవైనా ఆర్థిక సంబంధిత పనుల కోసం వెళ్లేవారు ఏయే రోజుల్లో బ్యాంకులు పని చేస్తాయో.. సెలవులుంటాయో తెలుసుకోవడం మంచిది. సాధారణ సెలవులతో పాటు పండుగ సెలవులు కలుపుకొని 18 రోజులు సెలవులు ఉండనున్నాయి. అయితే, బ్యాంకులు మూసి ఉన్నా మొబైల్, ఇంటర్‌నెట్, యూపీఐ సర్వీసులు నిరంతరాయంగా పని చేయనున్నాయి. వీటితో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నగదు ఉపసంహరణ కోసం ఏటీఎంలు అందుబాటులో ఉండనున్నాయి. పలు బ్యాంకులు క్యాష్ డిపాజిట్ కోసం మెషిన్లను సైతం అందుబాటులో ఉండగా.. వీటితో అకౌంట్‌లో డబ్బులు చేసుకునే వీలున్నది. కొన్ని సేవల కోసం బ్యాంకులకు వెళ్లే అవసరం ఉంటుంది. అలాంటి సమాచారం సెలవుల గురించి సమాచారం ఉంటే.. ముందస్తుగానే పనులు చేసుకునే వీలు కలుగుతుంది.

సెలవుల జాబితా ఇదే..: : అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సెలవు

డిసెంబర్ 3 : సెయింట్ జేవియర్ పండుగ సందర్భంగా గోవాలో సెలవు. డిసెంబర్ 7 : ఆదివారం కావడంతో దేశవ్యాప్తంగా హాలీడే.

2 : సంగ్మా పుణ్యతిథి నేపథ్యంలో మేఘాలయలో బ్యాంకుల బంద్.

3 : రెండో శనివారం కావడంతో హాలీడే.

4 : ఆదివారం కావడంతో దేశవ్యాప్తంగా బ్యాంకు ల మూసివేత.

8 : ఉసోసో థామ్ పుణ్యతిథి సందర్భంగా మేఘాలయలో హాలీడే.

9 : విముక్తి దినోత్సవం సందర్భంగా గోవాలో బ్యాంకులకు సెలవు.

డిసెంబర్ 20 : లూసూంగ్, నామ్సూంగ్ పండుగ సందర్భంగా సిక్కింలో బ్యాంకుల మూసివేత. డిసెంబర్ 21 : ఆదివారం సందర్భంగా బ్యాంకులు బంద్.

# తిరుమలలో ఏం జరుగుతోంది?



తిరుమల, : ఆ రెండు కేసులు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తున్నాయ్. కోట్లాది మంది భక్తుల విశ్వాసం..భక్తుల కొంగుబంగారంగా ఉన్న తిరుమల శ్రీవారి..కొండ చుట్టూ తిరుగుతున్న ఆ రెండు ఇష్యూస్‌పై రచ్చ కంటిన్యూ అవుతోంది. పరకామణి చోరీ కేసు అయితే బిగ్ టర్న్ తీసుకుంది. పరకామణి చోరీ కేసులో నిందితులను ఎప్పుడో గుర్తించారు. అతడి ఆస్తులపై దర్యాప్తు నడుస్తోంది. కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్ అనే అధికారి అనుమానాస్పద మృతి చెందడంతో పరకామని కేసు క్లైమాక్స్‌లో బిగ్ టర్న్ తీసుకున్నట్లు అయ్యింది.ఇక హుండీ చోరీ కేసులో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరెడ్డి, టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ విచారించింది. ప్రశ్నలు వేసి ఏం జరిగిందనే దానిపైఆరా తీసింది.పరకామణి చోరీచేసిన రవికుమార్ఆస్తుల జప్తులో ఏంజరిగింది.? ఎంతచోరీ జరిగితే..ఎన్ని ఆస్తులు జప్తు చేశారు.? రాజీ కుదర్చిందెవరు.? ఎవరి ఒత్తిడి వల్ల ఇదంతా చేశారని.? ఆరా తీస్తుంది సీఐడీ. నిందితులతో భూమన, ధర్మారెడ్డి, వైవీసుబ్బారెడ్డికి ఉన్న లింకులపై కూపీ లాగుతోంది. ఈ క్రమంలోనే సంచలనం సృష్టించిన టీటీడీ పరకామణి కేసులో దర్యాప్తును స్పీడప్ చేశారు సీఐడీ అధికారులు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ మూడుసార్లు ప్రశ్నించిందిపరకామణిలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని కాపాడేందుకు గత ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులే దగ్గరుండి వ్యవహారాన్ని నడిపించారని, చివరకు కేసు పెట్టినా కూడా లోక్ అదాలత్‌లో కొట్టేసేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపణలున్నాయి. ఇదంతా జరగడానికి కోట్లు చేతులు మారాయనే అభియోగాలు లేకపోలేదు. ఈ క్రమంలో అన్ని కోణాల్లో దర్యాప్తు అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసు అతిపెద్ద చిక్కుముడిగా మారింది. కీలక సాక్షి లేటెస్ట్‌గా మృతి చెందడంతో కేసు మరింత జఠిలం అవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్. పరకామణి కేసులో కూడా మరోసారి వైవీ సుబ్బారెడ్డికి సీఐడీ నుంచి పిలుపురావడం రకరకాల చర్చకు దారితీస్తోంది.ఇక తిరుమల కల్తీ నెయ్యి కేసు కూడా కొత్త టర్న్ తీసుకుంటోంది. సుప్రీం ఆదేశాలతో ఏర్పాటైన స్పెషల్ సిట్..ఇప్పటికే టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారించింది. టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నను అరెస్ట్ చేసింది. లేటెస్ట్‌గా వైవీ సుబ్బారెడ్డిని కూడా హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో ప్రశ్నించింది స్పెషల్ సిట్ టీమ్. అయితే 2019 నుంచి 2014 వరకు జరిగిన నెయ్యి సరఫరాపై మాత్రమే ఎందుకు విచారణ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు వైవీ సుబ్బారెడ్డిపదేళ్లలో నెయ్యి సప్లైపై విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లడ్డూ ఆరోపణలపై పాలీ గ్రాఫ్ పరీక్షకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన సుబ్బారెడ్డి..రాజకీయాలకు ఆలయాలను వాడుకుంటున్నారని ఆరోపించారు. స్వామివారి లడ్డూ ప్రసాద విషయంలో తనపై విషప్రచారం చేస్తున్నారని..కల్తీ నెయ్యి వ్యవహారంలో లైడిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమని అంటున్నారు వైవీ సుబ్బారెడ్డి. తనకు కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ఉండగా..నెయ్యిలో అవినీతి ఎందుకు చేస్తానని ప్రశ్నిస్తున్నారు. పరకామణి విషయంలో ఏం జరిగిందో తనకు తెలియదంటున్న వైవీ సుబ్బారెడ్డి..శ్రీవారి సేవలో నీతి నిజాయితీతో పనిచేశానని చెప్తున్నారు.అటు దర్యాప్తు సంస్థల విచారణ కొనసాగుతుండగానే..ఏపీ ప్రభుత్వం మాత్రం నిందితుల పట్ల కఠినంగా ఉంటామని తేల్చి చెబుతోంది. తప్పుచేసిన వారిని శ్రీవారు వదిలిపెట్టరని..శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరిస్తోంది. అయితే కల్తీ నెయ్యి కేసులో సిట్..పరకామణి కేసులో సీఐడీ దర్యాప్తు స్పీడప్ అవడం ఉత్కంఠ రేపుతోంది. ఓవైపు విచారణ కొనసాగుతుండగానే..ఓవైపు కల్తీ నెయ్యి..ఇంకోవైపు పరకామణి వ్యవహారంపై.. కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది.సమయం, సందర్భం దొరికినప్పుడల్లా కూటమి లీడర్లు రియాక్ట్ అవడం..తామేం తప్పు చేయలేదని వైసీపీ లీడర్లు వివరణ ఇచ్చుకుంటుండం..హాట్ టాపిక్‌గా నడుస్తోంది. పరకామణి కేసుతో పాటుకల్తీ నెయ్యి ఇష్యూలో కూడా వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి ఇద్దరు విచారణను ఫేస్ చేస్తుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి చుట్టూ ఈ రెండు కేసుల విచారణ కొనసాగుతుండటం బర్నింగ్ టాపిక్ అవుతోంది.అయితే ఈ ముగ్గురు వైసీపీ అధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. భూమన వైఎస్సార్ నుంచి జగన్ వరకు వాళ్ల ఫ్యామిలీ వెంట నడిచిన నేత. ఇక ధర్మారెడ్డి వైసీపీ హయాంలో టీటీడీలో అన్నీ తానై వ్యవహరించారు. ఈ ముగ్గురిని కార్నర్ చేసి..జగన్‌ను రాజకీయంగా వీక్ చేయాలని కూటమి కుట్ర చేస్తోందని ఆరోపిస్తోంది వైసీపీ. పరకామణి కేసు..కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో కన్‌క్లూజన్ ఎప్పుడో వేచి చూడాలి మరి

# బయిట పడుతున్న నకిలీ నెయ్యి లెక్కలు

తిరుమల, : మాజీ టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సన్నిహితుడు చిన్న అప్పన్న అరెస్ట్ తో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అప్పన్న రిమాండ్ రిపోర్టులో కుట్ర కోణాలను సిట్ ప్రస్తావించింది. కల్తీ నెయ్యి కేసులో అప్పన్నను 24వ నిందితుడిగా చేర్చింది. టీటీడీ కొనుగోళ్ల విభాగం జనరల్ మేనేజర్ ను 2022 లో అప్పన్న సంప్రదించాడు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే అన్ని కంపెనీల వివరాలను తీసుకున్నాడు. టీటీడీ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా భోలే బాబా డైరీ యాజమాన్యానికి అప్పన్న ఫోన్ చేశారు. బోలే బాబా కంపెనీ ప్రతినిధి పీపీ శ్రీనివాస్‌కు కాల్ చేశాడు. టీటీడీకి సరఫరా చేసే ప్రతి కిలో నెయ్యిపై రూ.25 కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇందుకు భోలే బాబా డైరీ యాజమాన్యం కమిషన్ ఇవ్వడానికి నిరాకరించింది. బోలేబాబా డైరీని అనర్హులుగా ప్రకటించేలా చేయడానికి అప్పన్న కుట్ర చేశాడు. బోలేబాబా డైరీ తనిఖీలు చేయాలంటూ టిటిడి ప్రొక్యూర్ మెంట్ జీఎమ్ పై ఒత్తిడి తెచ్చాడు. భోలే బాబా డైరీని అనర్హులుగా ప్రకటించే ప్రయత్నంలో డైరీకి వ్యతిరేకంగా అజ్ఞాత వ్యక్తులతో పిటిషన్లు వేయించాడు. అప్పన్న ఒత్తిడి తేవడం.. కుట్రలతో బోలేబాబా డైరీ నుంచి నెయ్యి సేకరణను టీటీడీ నిలిపివేసింది. భోలే బాబా డైరీ టెండర్ల నుంచి తొలగిపోవడంతో ఆ స్థానంలో ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రవేశించింది. బోలేబాబా డైరీ కంటే కిలో కు రూ.138 ఎక్కువ కోట్ చేసింది ప్రీమియర్ అగ్రిఫుడ్స్. పోటీ లేకపోవడంతో టీటీడీ నుంచి నెయ్యి సరఫరా కాంట్రాక్టును అగ్రిఫుడ్స్ దక్కించుకుంది. చిన్న అప్పన్నకు రూ.50 లక్షల వరకు ముడుపులు ముట్టినట్లు విచారణలో సిట్ అధికారులు గుర్తించారు. ప్రీమియర్ ఆల్ఫా కంపెనీ సంబంధం ఉన్న హవాలా ఏజెంట్ ద్వారా అప్పన్నకు చేరినట్లు విచారణలో బయటపడింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రమోటర్లతో అప్పన్న నిరంతరం సంప్రదించినట్లు అధికారులు గుర్తించారు. అప్పన్న బ్యాంకు



లావాదేవీలను పరిశీలించి అక్రమాల నిగ్గు తేల్చింది సిట్. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో కుట్రను ఛేదించేందుకు అప్పన్నను సిట్ కస్టడీకి కోరనుంది. మాజీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అక్రమాలను సిట్ గుర్తించింది. భోలే బాబా, ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, వైష్ణవి డైరీ నెయ్యి నమూనాలను పరీక్షించాలని 2022 లో అదేశాలు జారీ చేసింది. ఛైర్మన్ ఆదేశాలతో నెయ్యి నమూనాలను సీఎఫ్‌టీఆర్ఐ-మైసూరుకు టీటీడీ పంపింది. మైసూర్ సీఎఫ్ టిఆర్ఐ ల్యాబ్ నివేదికల్లో నెయ్యిలో వనస్పతి కల్తీలు ఉన్నట్లు నిర్ధారించారు. ల్యాబ్ నివేదికల్లో నెయ్యి కల్తీని ధృవీకరించినా అధికారులు చర్యలు తీసుకోలేదు. కల్తీ నెయ్యి గుర్తించినప్పటికీ కూడా 2022-2024 మధ్య కొనసాగిన నెయ్యి సరఫరా కొనసాగింది. రెండేళ్ల పాటు రూ.250 కోట్ల విలువైన 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా అయినట్టు సిట్ అధికారులు తెలిపారు. గుత్తేదారు కల్తీ నెయ్యి సరఫరా ద్వారా కిలోకు కిలో సుమారు రూ.250 చొప్పున లాభాలు ఆర్జించినట్లు సిట్ గుర్తించింది. అప్పన్న విచారణతో వెలుగుచూసిన అంశాలతో మరికొందరిని నిందితులుగా చేర్చింది సిట్. మాజీ టీటీడీ ఛైర్మన్ పిఎ చిన్న అప్పన్నతో సహా తొమ్మిది మందిని కొత్త నిందితులుగా చేర్చింది. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ కేసులో మున్ముందు ఇంకెన్ని సంచలన విషయాలు బయటపడుతాయో వేచి చూడాలి

# అమెరికాకు 62 వేల కోట్ల నష్టం

## ఒడిదుడుకుల్లో ఆర్థికం

న్యూయార్క్, : ఏ ముహూర్తంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాడో తెలియదు గాని.. ఆ దేశానికి ఏది కూడా కలిసి రావడం లేదు. ఆంక్షలు.. సుంకాలు.. ప్రపంచ దేశాలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నాడు ట్రంప్. ఒక రకంగా ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తున్నాడు. వాస్తవానికి ట్రంప్ విధిస్తున్న సుంకాలవల్ల ప్రపంచ దేశాల కంటే అమెరికాకే నష్టం ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయాన్ని ట్రంప్ గుర్తించడం లేదు. ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు.ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతోంది. అమెరికాలోని విపక్ష పార్టీల నేతలు కూడా ట్రంప్ తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అమెరికాలో కీలక బిల్లుల విషయంలో విపక్ష పార్టీ నిరసన వ్యక్తం చేసింది. బిల్లుల విషయంలో అధికార పార్టీ తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించింది. దీంతో అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం షట్ డౌన్ అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గడిచిన 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. దీనివల్ల అమెరికాలో ఏకంగా 62,000 కోట్ల సంపద ఆవిరి అయిపోయింది.పరిస్థితి ఇలాగే కొనసాగితే 11 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి అయిపోతుందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ పేర్కొంది. ఈ షట్ డౌన్ చాప కింద నీరు లాగా విస్తరిస్తోందని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా మారిపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఇది ఊహించిన దానికంటే అతిపెద్ద సమస్యగా



మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో 1981 నుంచి షట్ డౌన్ అనేది కొనసాగుతూ వస్తోంది. అమెరికా ప్రభుత్వం ఇప్పటివరకు 10 సార్లు మూతపడింది. అమెరికాలో ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత 2018 -19 కాలంలో దాదాపు 35 రోజుల పాటు ప్రభుత్వం మూతపడింది. అమెరికా దేశ చరిత్రలోనే అతిపెద్ద సుదీర్ఘమైన మూసివేత అని అక్కడి నిపుణులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం చట్టసభ సభ్యుల మధ్య ఏమాత్రం రాజ కుదరడం లేదు. ఈ ప్రకారం తీసుకుంటే గత రికార్డును ఈసారి చోటు చేసుకున్న షట్ డౌన్ బద్దలు కొడుతున్న అనే అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి. ఇప్పటికే అమెరికా జాబ్ మార్కెట్ చాలా బలహీనంగా ఉంది. షట్ డౌన్ ప్రభావం జాబ్ మార్కెట్ మీద తీవ్రతగా అనిపిస్తోంది. ఆర్థిక విధానాలు ఏమాత్రం బాగోలేదు. పైగా రాజకీయంగా కూడా ట్రంప్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కంపెనీలు పెట్టుబడి పెట్టే విషయంలో ఆలోచిస్తున్నాయి. మిగతా కంపెనీలు కృత్రిమ మేధ, ఆటోమేషన్ మీద ఆధారపడుతున్నాయి. ఇవన్నీ కూడా ఉద్యోగులకు నరకం చూపిస్తున్నాయి.

# కళ్యాణదుర్గంలో వైసీపీకి షాక్



అనంతపురం,: ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలామంది నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. అయితే ఇటీవల పార్టీకి రాజీనామాలు తగ్గాయి కానీ.. చాలా మండలాలతో పాటు మున్సిపాలిటీల్లో ఆ పార్టీ పట్టు కోల్పోయింది. అవిశ్వాస తీర్మానాల్లో వీగిపోయింది. రజక అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. మున్సిపల్ ఛైర్మన్ గా ఉన్న తలారి రాజ్ కుమార్ ను ప్రభుత్వం తప్పించింది. మున్సిపల్ ఛైర్మన్గా ఉన్న రాజ్కుమార్ గత 15 నెలలుగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సెప్టెంబర్ 22న ఏపీ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దానిపై సరైన వివరణ ఇవ్వకపోవడంతో ఆ పదవి నుంచి రాజ్ కుమార్ ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మున్సిపల్ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. కళ్యాణ దుర్గం మున్సిపల్ ఛైర్మన్ గా రాజ్ కుమార్ ఎన్నికయ్యారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తరువాత పరిస్థితి మారింది. 2024 నవంబర్ నుంచి 2025 ఏప్రిల్ వరకు కనీసం కౌన్సిలింగ్ మీటింగు జాడలేదు. దీంతో ప్రభుత్వానికి ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై పలుమార్లు మున్సిపల్ ఛైర్మన్ కు రాజకీయ హెచ్చరికలు కూడా వెళ్లాయి.

# ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు


## పలు కుటుంబాల్లో తీరని విషాదాలు

హైదరాబాద్: ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. గత వారం కర్నూలు జిల్లాలో వేమురి కావేరి బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం తెల్లవారుజామున మూడు ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాల య్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లి మండలం దామరాజు పల్లి దగ్గర జబ్బార్ ట్రావెల్స్ బస్సు ఓ ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బెంగుళూరుకు చెందిన ఓ మహిళ మరణించగా మరో 8 మంది గాయపడ్డారు. ఈ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తోంది. మృతురాలు బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. మరోవైపు.. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం జూబ్లీనగర్‌లో భారతి ట్రావెల్స్‌కి చెందిన బస్సు బోల్తా పడింది.

ఈ ప్రమాదం లో ఒకరు మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి. ఆయా ఘటనలపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే సోమవారం తెల్లవారు జామున చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో 19మంది దుర్మరణం చెందారు. చేవెళ్లలో తెల్లవారక ముందే బస్సెక్కిన 19 మంది ప్రయాణికుల బతుకులు తెల్లారేలోగా కానరానిలోకాలకు మరలిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోక ముందే

తమ వారికి దూరమయ్యా రు. క్షేమంగా వెళ్లొచ్చని ఆర్టీసీ బస్సు ఎక్కిన వారికి కంకర టిప్పర్ రూపంలో మృత్యుశకటం ఎదురొచ్చి ప్రాణాలనే బలి తీసుకున్నది. నిద్రలో ఉన్నవారు కొందరు శాశ్వత నిద్రలోకి జారిపోయారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురై 19 మంది సజీవ దహనమైన ఘటనను మరువకముందే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున మరోఘోర రోడ్డు ప్రమా దం జరిగింది.

# మారనున్న సింహాచలం రూపురేఖలు



విశాఖపట్టణం,: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన జరిగింది. నాల్కో సంస్థ సీఎస్ఆర్ కింద్ ఇచ్చిన రూ. 1.58 కోట్ల నిధులతో చేపట్టిన షెడ్లకు శంఖుస్థాపన చేశారు. ఇక కోల్‌కతాకు చెందిన ఓ భక్తుడు ఇచ్చిన రూ. 45 లక్షల విరాళంతో తొలిపావంచా వద్ద నిర్మించనున్న షెడ్డుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంఖుస్థాపన చేశారు. అంతేకాకుండా రూ. 3 కోట్లతో నిర్మించిన టీఎంఎస్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచల ఆలయ ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు.రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో ఒకటిగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం వెలుగొందుతోంది. విశాఖపట్నం జిల్లాలో కొలువై ఉన్న సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకోవడానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆయితే ప్రస్తుతం ఈ ప్రసిద్ధ ఆలయం రూపురేఖలు మారుతున్నాయి. భక్తులు ఇచ్చిన విరాళాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి.. రూ.3 కోట్లు వెచ్చించి సింహగిరిపై టీఎంఎస్ (టెన్సిల్ మెంబ్రేన్ షెల్టర్) షెడ్డు నిర్మించారు.కాగా, ఈ టీఎంఎస్ షెడ్డు ప్రారంభోత్సవం సింహగిరిపై జరిగింది. ఝాన్సీ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి గణబాబు పాల్గొన్నారు. టీఎంఎస్ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. కేవలం వంద రోజుల వ్యవధిలో.. నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా నిర్మాణాన్ని పూర్తి చేశారని చెప్పారు. దాతలకు, గుత్తేదారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.ఈ షెడ్డు ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి పనుల శంఖుస్థాపన కార్యక్రమాల్లో గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

సింహాచలం దేవస్థానంలో వైసీపీ పాలనలోని అవశేషాలను తొలగిస్తామన్నారు. గత ప్రభుత్వంలోని కొందరు సింహాచల క్షేత్రాన్ని వివాదాలకు చిరునామాగా మార్చారని.. తీసుకువస్తామని చెప్పారు. అంతేకాకుండా గత కొన్నాళ్లుగా స్వామి వారి ఆభరణాల లెక్కల్లో తేడాలు వస్తున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఉద్యోగుల వ్యవహారాలు, తదితర ఆరోపణలు ఆలయ ప్రతిష్ఠ ను దెబ్బతీస్తున్నాయని అన్నారు. ప్రసాద్ పథకం పనులు త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించారు.సింహాచల కొండపై విరాళాలతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. అందులో లోవతోటలో రూ. 98 లక్షలతో, ఆలయ ప్రాకారం చుట్టూ రూ. 60 లక్షలతో.. నాల్కో సంస్థ కార్పొరెట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన షెడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. దాంతో పాటు కోల్‌కతాకు చెందిన దాత ఇచ్చిన విరాళంతో కొండ దిగువన తొలిపావంచా దగ్గర రూ. 45 లక్షలతో నిర్మించనున్నారు

# శుక్రమౌఢ్యమి ప్రవేశంతో శుభకార్యాలకు సెలవు

## ఫిబ్రవరి వరకు ముహూర్తాలు లేవంటున్న పండితులు

తిరుమల, : గ్రహాల గమన స్థితిని బట్టి ఇప్పుడు శృక్ర మౌఢ్యమి నడుస్తోంది. దీంతో శుభకార్యాలకు తావు లేదు. సాధరణంగా డిసెంబర్‌లో మళ్లీ మంచి ముహూర్తాలు వచ్చేవి కానీ ఈ యేడు అలాంటి అవకాశం లేదు. ఈసారి దాదాపు మూడు నెలల పాటు శుభ ముహూర్తాలు లేవని పండితులు సెలవిస్తున్నారు. ఈనెల 26న మార్గశిర మాసం శుద్ధ షష్ఠి నుంచి ప్రారంభమైన శుక్ర మౌఢ్యమి మాఘ బహుళ అమావాస్య ఫిబ్రవరి 17 వరకూ కొనసాగనుంది. దీంతో సుమారు 84 రోజుల పాటు శుభకార్యాలకు ముహూర్తాలు లేవు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుక భాషలో మూఢమి అంటే చీకటి అంటారు. శుభకార్యాలకు గురుడు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడూ అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనమవడంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిషులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభసూచకం కాదని సూచిస్తున్నారు. మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా



జరుగుతాయి. అయితే.. ఈసారి మార్గశిరంలో ఒకటి, రెండు ముహూర్తాలే ఉండగా.. పుష్యం శూన్య మాసం అవుతుంది. ఇక మాఘంలోనూ ఒక్క మూహూర్తం లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథ సప్తమి, సరస్వతి జన్మదినమైన వసంత పంచమి మహామాఘ్‌గా కీర్తించబడే మాఘ పౌర్ణమి వంటి తిథులూ ఈసారి మూఢంలోనే కలిసిపోయాయి. ఈ నెల 26 నుంచి 2026 ఫిబ్రవరి 17 వరకు దాదాపు మూడు నెలల పాటు శుభకార్యాలకు మంచిరోజులు లేవని తిరుమల పండితులు చెబుతున్నారు. శుక్రమౌఢ్యం వల్ల ఒక్క శుభముహూర్తం కూడా లేదని అన్నారు. శుభకార్యాలతో పాటు గృహ ప్రవేశాలు, విగ్రహ ప్రతిష్ఠాపనలూ వంటివీ నిర్వహించడానికి అవకాశం లేదని సూచించారు. దీంతో దీనికి సంబంధించిన వ్యాపారాలపైనా ప్రభావం పడనుంది.

# భూభారతి నివేదిక పై సమగ్రంగా సమీక్ష



జయశంకర్ భూపాలపల్లి: జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ చిట్యాల మరియు టేకుమట్ల మండల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి భూభారతి నివేదిక పై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భూసంబంధిత రికార్డుల నవీకరణ, పెండింగ్ కేసుల పరిష్కారం, ఫీల్డ్ వెరిఫికేషన్ పురోగతిని తహసీల్దార్లతో పరిశీలించారు. భూభారతి నివేదికలో చూపిన అంశాలను సమయానుకూలంగా సవరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. భూముల సమస్యలపై ప్రజలు అనవసరంగా కార్యాలయాలకు తిరగకుండా తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



జయశంకర్: రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సోమవారం టేకుమట్ల, చిట్యాల మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సేవలు, రికార్డు నిర్వహణపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని, అలాగే కొనుగోలు సంబంధించిన ప్రతి లావాదేవీని సరైన సీరియల్ నంబర్లతో, పారదర్శకంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నోటీస్ బోర్డును తప్పనిసరిగా ఏర్పాటు చేసి, కేంద్ర వివరాలు, కొనుగోలు సమాచారం, ధరలు మొదలైన వివరాలను రైతులకు స్పష్టంగా చూపించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఇచ్చిన సూచనల ప్రకారం అన్ని రకాల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయాధికారులు ప్రతి రోజు కొనుగోలు కేంద్రాలను సందర్శించి, కొనుగోలు కార్యకలాపాలను పర్యవేక్షించి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు.తహసీల్దార్లు రోజూ కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు మరియు కేంద్ర సిబ్బందికి నాణ్యత ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు వివరించి, కొనుగోలు ప్రక్రియ ఎటువంటి అంతరాయం లేకుండా సాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, అలాగే ఓపిఎం ఎస్ ఎంట్రీలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిర్దేశిత రైస్‌మిల్లులకు సమయానికి తరలించడం తప్పనిసరి అని, ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించడం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఓ కిరణ్ కుమార్, టేకుమట్ల, చిట్యాల తహసీల్దారులు, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లైస్ ఆర్ ఐ మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

# సినిమా..

## 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్‌పై దిల్ రాజు క్లారిటీ




'ఎల్లమ్మ' సినిమా అనౌన్స్ చేసిన రోజు నుంచి ఈ చిత్రాన్ని వరుస ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దర్శకుడు వేణు యూడుగంటి (వేణు బలగం) రూపొందిస్తున్న ఈ ప్రాజెక్ట్ పట్ల భారీ అంచనాలు ఉండగా, రెండేళ్లుగా హీరో ఎవరు అనే విషయంలో మాత్రం గందరగోళం కొనసాగుతోంది. మొదట ఈ సినిమాలో నేచురల్ స్టార్ నాని హీరోగా నటిస్తున్నాడని ప్రకటించిన మేకర్స్, ఫస్ట్‌లుక్ కూడా విడుదల చేశారు. అయితే అనుకోని కారణాల వల్ల నాని ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగారు.తర్వాత ఈ చిత్రంలో నటించేందుకు శర్వానంద్ ఎంట్రీ ఇచ్చారు. కొంతకాలం తర్వాత ఆయనే తప్పుకున్నారు. అనంతరం నితిన్ హీరోగా ఫిక్స్ అయిపోయారని, షూటింగ్ కూడా త్వరలో ప్రారంభమవుతుందని నితిన్ స్వయంగా ప్రకటించారు. కానీ కొన్ని రోజులకే ఆయనను కూడా ఈ చిత్రం నుంచి తప్పించారని సమాచారం. ఇలా వరుసగా ముగ్గురు హీరోలు మారడంతో 'ఎల్లమ్మ' ప్రాజెక్ట్ భవిష్యత్తుపై ప్రశ్నలు మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో చివరకు ఈ చిత్రానికి సంబంధించి నిర్మాత దిల్ రాజు క్లారిటీ ఇచ్చారు. గోవాలో జరుగుతున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ.. ఎల్లమ్మ సినిమాకు హీరో ఇప్పటికే ఫైనల్ అయ్యాడు. త్వరలో అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అలాగే హీరోయిన్ వివరాలు కూడా డిసెంబర్‌లో వెల్లడిస్తాం. మా బ్యానర్ నుంచి 2026లో ఆరు సినిమాలు రిలీజ్ అవుతాయి.

వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ప్రస్తుతం 'రౌడీ జనార్ధన్' షూటింగ్ జరుగుతోంది'' అని తెలిపారు. దీంతో 'ఎల్లమ్మ' సినిమాను ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఇది నిజంగా గుడ్ న్యూస్. ఇన్ని మార్పుల తర్వాత కూడా ప్రాజెక్ట్ నిలిచేలా ఉండటం మేకర్స్ నమ్మకాన్ని చూపిస్తోంది. ఇప్పుడు అందరి చూపు కొత్త హీరో, హీరోయిన్ ఎవరన్న దానిపైనే ఉంది.ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుంది అనే దానిపై కూడా త్వరలోనే క్లారిటీ రానుంది. కొద్ది రోజుల క్రితం బలగం అనే చిత్రంతో బిగ్గెస్ట్ హిట్ కొట్టిన వేణు ఇప్పుడు తన రెండో చిత్రంతో ఎలాంటి విజయం అందుకుంటాడో చూడాలి.




## శరవేగంగా పెద్ది షూటింగ్

గేమ్ ఛేంజర్' సినిమాతో ఈ ఏడాది పెద్దగా ఆకట్టుకోలేని రామ్‌చరణ్ ఇప్పుడు తన నెక్స్ట్ సినిమాతో మళ్ళీ మాస్‌ను ఉర్రూతలూగించేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం చరణ్ 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమాలో నటిస్తున్నారు. ఇది ఒక విలేజ్ స్పోర్ట్స్ రివెంజ్ డ్రామాగా రూపొందుతోంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు.ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది.రామోజీ ఫిల్మ్ సిటీలో వేసిన భారీ సెట్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక కర్ణాటకలోని మైసూరు ప్రాంతంలో వెయ్యి మందికి పైగా డ్యాన్సర్లతో షూట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కిన ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రాన్ని రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే మార్చి 27న వరల్డ్ వైడ్‌గా విడుదల చేయాలని టీమ్ ప్లాన్ చేసింది. కాగా, దసరా పండుగ సందర్భంగా 'పెద్ది' నుంచి ఓ మ్యూజికల్ సింగిల్ విడుదల చేయనున్నట్లు- సమాచారం. ఇప్పటికే రామ్‌చరణ్ ఆ పాటను విన్నట్టు-, అది అద్భుతంగా ఉందని మెచ్చుకున్నట్టు సమాచారం. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ- జాన్వీ కపూర్ నటిస్తుండగా, సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా రామ్‌చరణ్ క్రికెట్ షాట్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కొంతమంది అంతర్జాతీయ క్రికెటర్లు కూడా దానిని రీ-క్రియేట్ చేయడంతో, సినిమా పట్ల ఆసక్తి మరింత పెరిగింది. రామ్‌చరణ్ అభిమానులు 'గేమ్ ఛేంజర్' ఫ్లాప్ తరువాత ఈ సినిమాపైనే ఆశలు పెట్టుకున్నారు. సుకుమార్ శిష్యుడు డైరెక్ట్ చేస్తుండటం, కథలో విలేజ్ బ్యాక్‌డ్రాప్, క్రికెట్, రివెంజ్ అంశాలు ఉండటంతో పాటు-, ఏఆర్ రెహమాన్ సంగీతం మేజర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి.దసరా సీజన్‌లో మెగాస్టార్ చిరంజీవి తన కొత్త సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్టు- సమాచారం. బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం 'వాల్తేరు వీరయ్య' తరువాత వారి రెండో కాంబో కావడం విశేషం. దీంతో దసరాకి తండ్రి, కొడుకులిద్దరూ మెగా ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇవ్వనున్నట్టు- గాసిప్ ఫిలింనగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## మృణాల్ బ్యూటీ సీక్రెట్ ఇదే..!

'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనే ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం



నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి.

## అరుణాచలంలో సెల్ఫీలు, వ్లాగ్‌లు.. వాళ్లే అంతా నాశనం : శివాజీ రాజా




ఇటీవల తెలుగు భక్తులు పెద్ద సంఖ్యలో అరుణాచలాన్ని దర్శించడం మనం చూస్తూనే ఉన్నాం. చాగంటి కోటేశ్వరరావు గారు అరుణాచలం మహిమను వివరించిన తర్వాత మరింతగా తెలుగు భక్తుల రద్దీ పెరిగింది. అయితే, భక్తితో వెళ్లి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాల్సిన చోట కొంతమంది ఫోటోలు, వీడియోలు, వ్లాగ్స్ అంటూ హడావిడి చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రమణ మహర్షి ఆశ్రమం సైలెన్స్‌ను భంగం చేస్తుండటంపై స్థానిక తమిళులు కూడా అప్పుడప్పుడూ అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో అరుణాచలంలో జరుగుతున్న ఈ హంగామా గురించి సీనియర్ నటుడు శివాజీ రాజా స్పష్టం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అరుణాచలం గురించి ఎవరికీ తెలియనప్పుడు నుంచే నేను, మా మిసెస్, మా ఫ్యామిలీ 30 ఏళ్లుగా వెళ్తున్నాం. అక్కడ నాకు ల్యాండ్ కూడా ఉంది. ఇల్లు కట్టుకోవాలనుకున్నా కుదరలేదు. మేము సింపుల్‌గా దండం పెట్టుకొని వచ్చేస్తాం. నేను, రాజా రవీంద్ర రెగ్యులర్‌గా వెళ్తుంటాం అని తెలిపారు. ఇక ఇటీవలి రద్దీ గురించి మాట్లాడుతూ.. ఇప్పుడు 25 శాతం మంది అరుణాచలంని ఒక వెకేషన్ ట్రిప్‌లా చూస్తున్నారు. అది చూసి స్టేటస్ పెట్టుకోవాలి, ఫోటోలు తీయాలి, వీడియోలు తీయాలి అనుకునే వాళ్లు పెరిగారు. వాళ్లు ఎక్కడ అడుగుపెట్టినా అక్కడ నాశనమే అన్నారు. రమణాశ్రమం చాలా సైలెంట్‌గా ఉంటుంది. అక్కడి వాతావరణం భక్తితో నిండిపోతుంది. వెంకటేష్, ఇళయరాజా లాంటి వారు కూడా చాలా ప్రశాంతంగా దర్శనం చేస్తారు.


## 'మన శంకర వరప్రసాద్ గారు' క్రేజీ అప్‌డేట్ ..




మెగాస్టార్ చిరంజీవి నటించిన మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు' ఈ సంక్రాంతికి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి. చిరు ఎనర్జీ, నయనతారస్క్రీన్ ప్రెజెన్స్, అనిల్ స్టైల్ వినోదం కలిసి ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనేలా చేశాయి.షైన్ స్క్రీన్స్,గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి అర్చన సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల విడుదలైన పోస్టర్లు, చార్ట్‌బస్టర్ సాంగ్ 'మీసాల పిల్ల' సినిమా చుట్టూ హైప్ మరింత పెంచాయి. ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ చేస్తున్న కీలక పాత్ర స్పెషల్ అట్రాక్షన్‌గా మారనుంది. ఇది కేవలం అతిథి పాత్ర కాకుండా కథలో ప్రధానమైన క్యారెక్టర్‌గా రూపొందించబడింది. చిరు-వెంకీ కలయికకు అభిమానులు ఏళ్లుగా ఎదురుచూస్తుండగా, చివరకు ఈ కాంబినేషన్ కుదరడంతో క్రేజ్ మరింత పెరిగింది. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి స్క్రీన్‌పై స్టైలిష్ మాస్ స్టెప్పులు వేయనున్నారని తెలిసి ఫ్యాన్స్ ఉత్సాహం రెట్టింపైంది. తాజాగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రంగురంగుల భారీ కార్నివాల్ సెట్‌లో చిరంజీవి - వెంకటేష్‌లపై ఓ ఎనర్జిటిక్ డ్యాన్స్ సాంగ్ చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ ప్రత్యేక సెట్‌లో 500 మందికి పైగా డ్యాన్సర్లు పాల్గొంటుండటం విశేషం.పండుగ వాతావరణాన్ని తలపించేలా కలర్‌ఫుల్ థీమ్, గ్రాండ్ కాస్ట్యూమ్స్, వైబ్రంట్ అట్మాస్ఫియర్‌తో మేకర్స్ ఈ సాంగ్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. 'మీసాల పిల్ల' సాంగ్‌కు భారీ రెస్పాన్స్ రావడంతో దాని కొరియోగ్రాఫర్ పోలంకి విజయ్ కొత్త డ్యాన్స్ నంబర్‌కు కూడా డ్యాన్స్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక భీమ్స్ సిసిరోలియో అందించిన బాణీలు ఇప్పటికే సంగీత ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. చిరు-నయనతారలపై కేరళలో చిత్రీకరించిన మెలోడీ సాంగ్‌ను త్వరలో రిలీజ్ చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ ఫైనల్ స్టేజ్‌లో ఉంది. వినోదం, భావోద్వేగం, మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ మేళవింపుతో సినిమా రూపొందుతుందంటూ దర్శకుడు అనిల్ రావిపూడి వెల్లడించారు

## పెళ్లి ఎప్పుడో చెప్పిన జాన్వీ కపూర్..!

అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ బ్యూటీ జాహ్నవి కపూర్ ఎట్టకేలకు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలపై స్పందించింది. శిఖర్‌పహారియాతో పెళ్లి వార్తలు తెగహల్‌చల్ చేస్తున్న వేళ.. ఈ వార్తలన్నింటికి చెక్ పెట్టింది. పెళ్లికి ఇంకా సమయం ఉందని.. ప్రస్తుతం తన దృష్టి అంతా నటనపైనే ఉందని స్పష్టం చేసింది. ఇటీవల ముంబయిలో జరిగిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందర్భంగా జాన్వీ మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా 'మీ పెళ్లి ఎప్పుడు ' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి జాన్వీ స్పందిస్తూ.. 'ఇప్పుడంతా నా కెరీర్ మీదే ఫోకస్ ఉంది. పెళ్లికి సమయం ఉంది' అంటూ బదులిచ్చింది. అయితే,శిఖర్ పహారియాతో జాన్వీ రిలేషన్‌లో ఉన్నట్లుగా గతకొంత కాలంగా వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్‌తో జాన్వీ పలు ఈవెంట్లకు కలిసి రావడం, ఆమెఫోన్ స్పీడ్ డయల్‌లో శిఖర్ పేరు ఉండడం, 'శిఖు' పేరుతో ఉన్న నెక్లెస్ ఆమె ధరించడంతో ప్రస్తుతం ఇద్దరు రిలేషన్‌లో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వచ్చాయి. ఈ తాజా ఈవెంట్‌లో శిఖర్ పేరును ప్రస్తావించకపోయినా.. పెళ్లి వార్తలపై జాన్వీఓక్లియర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమాలో జాన్వీ వరుణ్‌ధావన్‌తో కలిసి నటిస్తున్నది. ఈ సినిమా అక్టోబర్2న థియేటర్లలో విడుదల కానుంది. అలాగే, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తోతెలుగులో 'పెద్ది' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215